నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com



హైదరాబాద్ | ఆదివారం 25-4-2021 | RNI No.52865/93·Postal No\.H/SD/258/2020-2022 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి :27 | సంచిక: 221 | పేజీలు:4 | వెల: రూ.1/-

సుప్రీం పీఠంపై తెలుగు తేజం.. 48వ సీజేఐగా ప్రమాణం

న్యూఢిల్లీచ, ఏప్రిల్ 25: భారత న్యాయవ్యవస్థ అత్యున్నత పీఠాన్ని అధిష్ఠించారు జస్టిస్ ఎన్..వి రమణ. రాష్ట్రపతి భవన్‌లో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్.. భారత 48వ ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎన్?.వి. రమణతో ప్రమాణం చేయించారు. వచ్చే ఏడాది ఆగస్టు 26 వరకు జస్టిస్ రమణ ఆ పదవిలో కొనసాగనున్నారు. ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు హాజరయ్యారు.

55 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత అత్యున్నత న్యాయపీఠాన్ని అధిష్ఠించిన రెండో తెలుగు వ్యక్తిగా జస్టిస్ ఎన్.వి. రమణ కీర్తికెక్కారు. గతంలో రాజమహేంద్రవరానికి చెందిన జస్టిస్ కోకా సుబ్బారావు భారత 9వ ప్రధాన న్యాయమూర్తిగా పనిచేశారు. సంప్రదాయం ప్రకారం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తులు తమ పదవీ విరమణకు నెలరోజులముందే తదుపరి సీజేఐ పేరును.. కేంద్రానికి ప్రతిపాదించాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో తదుపరి సీజేఐగా.. సుప్రీంకోర్టులో అత్యంత సీనియర్ న్యాయమూర్తిగా ఉన్న జస్టిస్ ఎన్.వి. రమణ పేరును.. మార్చి 24న జస్టిస్ బోబ్డే ప్రతిపాదించారు. సీజేఐ ప్రతిపాదనను కేంద్ర న్యాయశాఖ.. కేంద్ర హోంశాఖకు పంపింది. అక్కడ పరిశీలన అనంతరం రాష్ట్రపతి కార్యాలయానికి చేరగా.. రామ్‌నాథ్ కోవింద్ ఆమోదముద్ర వేశారు. రాష్ట్రపతి ఆమోదంతో కేంద్ర న్యాయశాఖ.. భారత 48వ సీజేఐగా జస్టిస్ ఎన్.వి. రమణను నియమిస్తూ ఈనెల 6న ఉత్తర్వులు జారీచేసింది. ఇవాళ ఆయన సీజేఐగా ప్రమాణ స్వీకారం చేశారు. 2022 ఆగస్టు 26 వరకు జస్టిస్ ఎన్.వి రమణ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి పదవిలో కొనసాగుతారు.

ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణాజిల్లా పొన్నవరం గ్రామంలో 1957 ఆగస్టు 27న సాధారణ వ్యవసాయ కుటుంబంలో నూతలపాటి గణపతిరావు, సరోజినిదేవీ దంపతులకు జన్మించిన జస్టిస్ రమణ స్వయంకృషితో అంచెలంచెలుగా ఎదిగారు. 1966లో జస్టిస్ కోకా సుబ్బారావు భారత 9వ ప్రధాన న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టగా.. ఆ తరువాత ఇన్నేళ్లకు జస్టిస్ రమణ మళ్లీ న్యాయ వ్యవస్థలో అత్యున్నత పదవిని చేపడుతున్న తెలుగు వ్యక్తిగా ఖ్యాతి గడించారు. జస్టిస్ కోకా సుబ్బారావు న్యాయవాద కుటుంబంలో పుట్టి పెరిగి ఆ రంగంలో అత్యున్నత స్థానానికి చేరితే, జస్టిస్ రమణ సాధారణ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చి సర్వోన్నత పీఠాన్ని అధిరోహించబోతున్నారు. పొన్నవరంలో ప్రాథమిక విద్య పూర్తిచేశారు. తర్వాత కంచికచర్లలో విద్యాభ్యాసం సాగించారు.

అమరావతి ఆర్‌వీవీఎస్ కాలేజీ నుంచి బీఎస్సీ డిగ్రీ, 1982లో నాగార్జున విశ్వవిద్యాలయం నుంచి న్యాయశాస్త్ర పట్టా పొందారు. 1983 ఫిబ్రవరి 10న న్యాయవాదిగా పేరు నమోదు చేసుకొని న్యాయవ్యవస్థలోకి అడుగుపెట్టిన ఆయన ఎన్నో ఆటుపోట్లను ఎదుర్కొంటూ పురోగమించారు. 2000 జూన్ 27న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు శాశ్వత న్యాయమూర్తిగా నియమితులైన ఆయన.. తర్వాత అదే హైకోర్టులో తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తిగా, అనంతరం ఢిల్లీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా సేవలందించారు. 2014లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదోన్నతి పొందారు. గత ఏడేళ్లుగా సుప్రీంకోర్టులో ఎన్నో ముఖ్యమైన తీర్పులు వెలువరించారు. సుప్రీంకోర్టులో గత ఏడేళ్లలో ఏటా 2వేల వరకు కేసులను విచారించారు. వేల సంఖ్యలో ఉత్తర్వులు జారీచేశారు. 156 కీలకమైన తీర్పులు ఇచ్చారు. కాగా, సీజేఐగా నియమితులైన జస్టిస్ రమణకు పలువురు ముఖ్యమంత్రులు, కేంద్రమంత్రులు, వివిధ పక్షాల నేతలు, ఎంపీలు అభినందనలు తెలిపారు.

సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ రమణకు కెసిఆర్ శుభాకాంక్షలు

హైదరాబాద్ ఏప్రిల్ 24: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా ప్రమాణం చేసిన జస్టిస్ ఎన్వీ రమణకు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు కెసిఆర్ ఒక ప్రకటన విడుదల చేశారు. మీ విశేష అనుభవం దేశానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. మీ పదవీకాలం గొప్పగా సాగాలని ఆకాంక్షిస్తున్నట్లు సీఎం కేసీఆర్ పేర్కొన్నారు. కాగా,సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా జస్టిస్ ఎన్వీ రమణ శనివారం ఉదయం ప్రమాణం చేసిన సంగతి తెలిసిందే. జస్టిస్ ఎన్వీ రమణతో రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ప్రమాణస్వీకారం చేయించారు. 48వ సీజేఐగా జస్టిస్ ఎన్వీ రమణ 2022, ఆగస్టు 26వ తేదీ వరకు ఈ పదవిలో కొనసాగనున్నారు.

భారత్‌లో పరిస్థితి ఘోరం : డబ్ల్యూహెచ్‌ఓ

హైదరాబాద్ ఏప్రిల్ 24: భారత దేశంలో పెరుగుతున్న కరోనా సెకండ్ వేవ్ ఇన్ఫెక్షన్ కేసుల పట్ల ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) ఆందోళన వ్యక్తం చేసింది. వైరస్ ఎంత తీవ్రంగా ఉంటుందో సెకండ్ వేవ్ గుర్తుచేస్తున్నదని డబ్ల్యూహెచ్‌ఓ చీఫ్ టెడ్రోస్ అధోనం ఘెబ్రేయెస్ అన్నారు. జెనీవాలో జరిగిన వర్చువల్ బ్రీఫింగ్ సందర్భంగా ఆక్సిజన్ కొరత, దవాఖానల్లో బెడ్స్ కొరత, రెమ్‌డెసివిర్ వంటి ప్రధాన అత్యవసర ఔషధాల కొరత కారణంగా భారత్‌లో ప్రతి రోజు గడిచేకొద్దీ పరిస్థితి చేతులెత్తేస్తున్నట్లు కనిపిస్తోంది అని ఘెబ్రేస్ తెలపారు.

25 నుంచి 59 ఏండ్ల మధ్య వయస్కుల్లో ఇన్‌ఫెక్షన్ వేగంగా పెరుగుతున్నదని ట్రెడోస్ చెప్పారు. కరోనా యొక్క కొత్త వేరియంట్ మరింత వ్యాప్తి చెందే ఫలితం కావచ్చునన్నారు. ప్రపంచవ్యాప్తంగా మరింత వేగంగా టీకాలు వేయడం అవసరమని పేర్కొన్నారు. ఆగ్నేయాసియాలో ఇన్‌ఫెక్షన్ మరణాల సంఖ్యను తగ్గించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

మరోవైపు, అనేక దేశాల్లో ఉన్న భారతీయ మిషన్లు అక్కడ ప్రభుత్వాలు, సంస్థలతో ఆక్సిజన్, రెమ్‌డెసివిర్ ఇంజెక్షన్‌తోపాటు ఇతర ఔషధాల కోసం చర్చలు జరుపుతున్నాయి. యూఏఈ, సింగపూర్, మరికొన్ని ఆగ్నేయాసియా దేశాల నుంచి ఆక్సిజన్‌ను సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు. రష్యా కూడా ఆక్సిజన్ సరఫరాకు సహాయం చేయడానికి ముందుకొచ్చింది.

ముడి పదార్థాలపై అమెరికా మౌనం

భారతదేశంలో వ్యాక్సిన్ల తయారీకి అవసరమైన ముడి పదార్థాలను ఈయూ, బ్రిటన్, అమెరికా దేశాలు సరఫరా చేయడంలేదు. ముడి పదార్థాలు సరఫరా చేయడంపై మౌనందాల్చిన అమెరికా.. తమ దేశ పౌరుల ఆరోగ్య భద్రతే తమకు మొదటి ప్రాధాన్యం అని స్పష్టం చేయడం గమనార్హం.

తెలంగాణలో ఉచితంగా కరోనా టీకా : సీఎం కేసీఆర్

హైదరాబాద్ ఏప్రిల్ 24: కరోనా టీకా విషయంలో ముఖ్యమంత్రి కేసీఆర్ కీలక నిర్ణయం తీసుకున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 18 ఏండ్లు నిండిన ప్రతి ఒక్కరికీ కరోనా టీకా ఉచితంగా ఇస్తామని ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించారు. ప్రజల ప్రాణాల కంటే డబ్బు ముఖ్యం కాదు అని తేల్చిచెప్పారు. వ్యాక్సినేషన్ కోసం దాదాపు రూ. 2,500 కోట్లు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. వ్యాక్సినేషన్ కోసం ఇప్పటికే అధికారులను ఆదేశించామని సీఎం తెలిపారు.

వయసుతో సంబంధం లేకుండా టీకా

స్వంతంగా రాష్ట్ర జనాభా, ఇతర రాష్ట్రాల నుండి ఇక్కడికి వచ్చి అనేక సెక్టార్లలో పనిచేస్తున్న జనాభా కలుపుకుని, తెలంగాణ రాష్ట్రంలో సుమారు నాలుగు కోట్లమంది దాకా ప్రజలు వున్నారని, వీరిలో ఇప్పటికే 35 లక్షల మందికి పైగా వ్యక్తులకు వాక్సినేషన్ (టీకా) ఇవ్వడం జరిగిందని, మిగతా అందరికీ వయసుతో సంబంధం లేకుండా, రాష్ట్రంలో వున్న ప్రతివారికీ వాక్సినేషన్ ఇవ్వాలని ముఖ్యమంత్రి శ్రీ కె చంద్రశేఖర్ రావు నిర్ణయించారు. ఇలా మొత్తం అందరికీ వాక్సినేషన్ ఇవ్వడానికి సుమారు రూ. 2,500 కోట్ల రూపాయలకు పైగా ఖర్చు అవుతుందనీ, ప్రజల ప్రాణాల కంటే డబ్బు ముఖ్యం కాదనీ, అందరికీ వాక్సినేషన్ ఇవ్వడం జరుగుతుందనీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. దీనికి సంబంధించిన ఆదేశాలను ముఖ్యమంత్రి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, వైద్యశాఖ అధికారులకూ ఇవ్వడం జరిగింది. తదనుగుణంగా మొత్తం రాష్ట్రంలో వున్న అందరికీ వాక్సినేషన్ ఇవ్వడానికి చర్యలు తీసుకోవాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు.

టీకాల విషయంలో ఎలాంటి ఇబ్బంది లేదు

ఇప్పటికే భారత్ బయోటెక్ వాక్సినేషన్ తయారీ చేస్తున్నదని, రెడ్డీ ల్యాబ్స్ తో సహా మరికొన్ని సంస్థలు వాక్సినేషన్ తయారీకి ముందుకు వచ్చాయని, కాబట్టి వాక్సినేషన్ విషయంలో ఎలాంటి ఇబ్బంది వుండబోదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రెండు-మూడు రోజుల్లో తనకు అవసరమైన వైద్య పరీక్షలు జరిగి, పూర్తి స్వస్థత చేకూరిన తరువాత సంబంధిత అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించి వాక్సినేషన్ కార్యక్రమాన్ని స్వయంగా పర్యవేక్షిస్తానని ముఖ్యమంత్రి అన్నారు. వాక్సినేషన్ కార్యక్రమం పటిష్టంగా, విజయవంతంగా అమలు చేయడానికి జిల్లాలవారీగా ఇంచార్జులను నియమించడం కూడా జరుగుతుందని సీఎం కేసీఆర్ చెప్పారు.

టీకాలు, రెమిడెసివర్, ఆక్సిజన్ కొరత రానివ్వం

వాక్సినేషన్ కార్యక్రమంతో పాటు, రెమిడెసివర్ తదితర కరోనా సంబంధిత మందులకు, ఆక్సిజన్ కు ఎలాంటి కొరత రాకుండా చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు. ప్రజలు ఏ విధమైన భయభ్రాంతులకు గురికావద్దని, కరోనా సోకినవారికి పడకల విషయంలోనూ, మందుల విషయంలోనూ ప్రభుత్వం చేయాల్సినదంతా చేస్తుందని, ప్రజలను కోవిడ్ బారి నుండి కాపాడడానికి అన్ని రకాల చర్యలు తీసుకుంటుందని, పెద్ద ఎత్తున సానిటేషన్ చేపట్టుతుందని ముఖ్యమంత్రి భరోసా ఇచ్చారు. ప్రజలను అధైర్య పడవద్దని, ఏ మాత్రం నిర్లక్ష్యంగా వుండవద్దని సీఎం కోరారు.

స్వయం క్రమశిక్షణ పాటించాలి

పెద్ద ఎత్తున గుంపు-గుంపులుగా కూడవద్దని, ఊరేగింపులలో పాల్గొనవద్దని, అత్యవసరమైతేనే తప్ప బయట తిరగవద్దని, స్వయం క్రమశిక్షణ పాటించాలని ముఖ్యమంత్రి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల క్షేమమే లక్ష్యంగా పనిచేస్తున్న ప్రభుత్వం కరోనా మహమ్మారి విషయంలో చేయాల్సినదంతా పటిష్టంగా చేస్తుందని సీఎం కేసీఆర్ మరోమారు చెప్పారు.

ప్రజల సహకారంతోనే ప్రగతిపథంలో పాలనా వ్యవస్థ : సీఎం కేసీఆర్

హైదరాబాద్ ఏప్రిల్ 24:జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ప్రభుత్వ పాలనలో ప్రజల భాగస్వామ్యం పెరిగినపుడే, ప్రజల సహకారంతోనే పాలనావ్యవస్థ ప్రగతిపథంలో ముందడుగు వేస్తుందని సీఎం అన్నారు. స్వాతంత్ర్యానంతర భారత దేశంలో ప్రజలను పాలనలో భాగస్వాములను చేయాలనే మహోన్నత లక్ష్యంతో నాటి సోషల్ ఇంజనీర్ గా ప్రసిద్ధి పొందిన సురేందర్ కుమార్ దే (ఎస్‌కేడే) పంచాయతీరాజ్ వ్యవస్థకు అంకురార్పణ చేశారన్నారు. ప్రజలు తమ అభివృద్ధిని తామే నిర్వచించుకునే స్వయం సహకార ఉద్యమం లో భాగంగా పంచాయతీ రాజ్ వ్యవస్థ భారత దేశంలో రూపుదిద్దుకున్నదని సీఎం గుర్తు చేసుకున్నారు.

కమ్యునిటీ డెవలప్‌మెంట్‌లో భాగంగా రాజకీయాలకు అతీతంగా గ్రామాల అభివృద్ధి జరుగాలనే నాటి ఎన్‌కేడే ఆశయాలను తెలంగాణ ప్రభుత్వం అమలు పరుస్తున్నదని సీఎం తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం అమలులోకి తెచ్చిన నూతన పంచాయతీరాజ్ చట్టం దేశ పంచాయతీరాజ్ వ్యవస్థకు ఆదర్శంగా నిలిచిందని సీఎం అన్నారు. ఎవరి గ్రామాన్ని వారే తీర్చిదిద్దుకునే విధంగా ప్రజలను భాగస్వాములను చేస్తూ పల్లెల్లో పాలనావ్యవస్థను ప్రభుత్వం బలోపేతం చేసిందని తెలిపారు.

పల్లెల అభివృద్ధికి ప్రతి నెల రూ. 339 కోట్లు

పల్లెల అభివృద్ధికిగాను ప్రతినెలా రూ. 339 కోట్లు, పట్టణాల అభివృద్ధికి ప్రతినెలా రూ. 148 కోట్లు క్రమం తప్పకుండా రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్నదన్నారు. పంచాయితీరాజ్ వ్యవస్థ బలోపేతానికి తెలంగాణ ప్రభుత్వం భారతదేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. తెలంగాణ ప్రభుత్వం అమలు పరుస్తున్న పల్లె ప్రగతి పట్టణ ప్రగతి సహా ఇతర అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలతో పల్లెలు పట్టణాలు పరిశుభ్రంగా పచ్చదాన్ని సంతరించుకుని అభివృద్ధి పథంలో నడుస్తున్నయన్నారు. దేశంలో మరే రాష్ట్రం అందుకోని విధంగా తెలంగాణ పంచాయతీ రాజ్ శాఖ కేంద్ర ప్రభుత్వ సంస్థల చేత అనేక జాతీయ అవార్డులు ప్రశంసలను అందుకుంటున్నదన్నారు. రాష్ట్రంలో పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతం అవుతున్నదనడానికి ఈ అవార్డులు ప్రశంసలు నిదర్శనంగా నిలిచినాయని సీఎం తెలిపారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం

సాగు నీటి ప్రాజెక్టుల నిర్మాణం, రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధితో పాటు గ్రామీణ ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అమలు పరుస్తున్న పలు పథకాలు సబ్బండ వర్గాలను అభివృద్ధిలో భాగస్వాములను చేస్తున్నాయన్నారు. తద్వారా నాటి ఎస్‌కేడే కలలు కన్న పంచాయతీరాజ్ సహకార వ్యవస్థ లక్ష్యాలను సాధించడంలో తెలంగాణ ప్రభుత్వం ముందంజలో వున్నదని సీఎం కేసీఆర్ తెలిపారు.

నిలకడగా మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్ ఆరోగ్యం

న్యూఢిల్లీ, ఏప్రిల్ 24: ఇటీవల కరోనా మహమ్మారి బారినపడ్డ భారత మాజీ ప్రధాని, కాంగ్రెస్ పార్టీ కురువృద్ధుడు మన్మోహన్‌సింగ్ ప్రస్తుతం కోలుకుంటున్నారు. ఢిల్లీలోని ఎయిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన ఆరోగ్యం ప్రస్తుతం నిలకడగానే ఉన్నదని కాంగ్రెస్ అధికార ప్రతినిధి రణ్‌దీప్‌సింగ్ సుర్జేవాలా ప్రకటించారు.

ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారని, జ్వరం తగ్గిపోయిందని సుర్జేవాలా చెప్పారు. మన్మోహన్ సింగ్‌కు స్వల్పంగా జ్వరం రావడంతో ఈ నెల 19న ప్రీమియర్ ఆస్పత్రిలో చేరారు. అక్కడ పరీక్షలు నిర్వహించగా ఆయనకు కరోనా పాజిటివ్ వచ్చింది. దాంతో మెరుగైన చికిత్స కోసం ఆయనను ఎయిమ్స్‌లో చేర్చారు. కాగా, మన్మోహన్‌సింగ్ మార్చి 4, ఏప్రిల్ 3 తేదీల్లో రెండు డోసులు కరోనా వ్యాక్సిన్ తీసుకున్నారు

రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో వర్షాలు : ఐఎండీ

హైదరాబాద్ , ఏప్రిల్ 24: : రాష్ట్రంలో మూడు రోజుల్లో తేలిక పాటి వర్షాలు కురిసే అవకాశాలున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం శనివారం వెల్లడించింది. ప్రధానంగా దక్షిణ, పశ్చిమ, మధ్య తెలంగాణల్లోని కొన్ని జిల్లాలో ఒకటి రెండు ప్రదేశాల్లో వానలు పడుతాయని ఐఎండీ అధికారులు విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. నిన్న మరాఠ్వాడా పరిసర ప్రాంతాల్లో ఉపరిత బలహీన ద్రోణి బలహీనపడిందని తెలిపారు. ఇవాళ తూర్పు, ఉత్తర ఉపరిత ఆవర్తన మరాఠ్వాడా నుంచి కర్ణాటక, తెలంగాణ, రాయలసీమ మీదుగా దక్షిణ కోస్తా, తమిళనాడు వరకు ఆవర్త ఏర్పడిందని వివరించారు. దీని ప్రభావం వల్ల రాష్ట్రంలో రాగల మూడు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పారు. ఇదిలా ఉండగా.. శనివారం మహబూబాబాద్, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, నల్గొండ జిల్లాల్లో తేలికపాటి జల్లులు కురిశాయి.

కేరళలో 48 గంటలు లాక్‌డౌన్ తరహా ఆంక్షలు

తిరువనంతపురం, ఏప్రిల్ 24: : భారీగా పెరుగుతున్న కొవిడ్ కేసుల నేపథ్యంలో కేరళలో ప్రభుత్వం శనివారం నుంచి 48 గంటల పాటు రాష్ట్రంలో లాక్‌డౌన్ తరహా ఆంక్షలు విధించింది. అత్యవసర సేవలు మినహా మినహాయించి అన్ని రంగాలకు సెలవులు ప్రకటించింది. అనవసరంగా రోడ్లు, బహిరంగ ప్రదేశాల్లో ఎవరూ తిరుగకుండా చూసేందుకు ఉదయం నుంచి పోలీసులు వాహనాలు తనిఖీ చేపట్టారు. పోలీసు వర్గాల సమాచారం మేరకు.. అవసరమైన వ్యక్తులకు ప్రయాణానికి అనుమతి ఉంటుందని, ప్రభుత్వ ఆంక్షలు, కొవిడ్ నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించనున్నట్లు తెలిపారు.

మరో వైపు కేరళ స్టేట్ రోడ్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ (కేఎస్‌ఆర్‌టీసీ) బస్సు సర్వీసులు నడుపుతున్నా చాలా జిల్లాల్లో వైరస్ భయంతో ప్రయాణికుల సంఖ్య భారీగా తగ్గింది. హోటళ్లు, రెస్టారెంట్లు తెరిచినా.. పార్శిల్ సర్వీస్‌కు మాత్రమే ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. కూరగాయలు, పండ్లు, మాంసం దుకాణాలు కొనసాగాయి. ఎర్నాకుళం జిల్లాకు వచ్చిన వలస కార్మికులను పోలీసులు తిరిగి పంపించి వేశారు. కొచ్చిలో కొవిడ్ నిబంధనలు ఉల్లంఘించినందుకు ఓ ప్రైవేటు ట్యాక్సీ క్యాబ్‌పై కేసు నమోదు చేశారు. ఇదిలా ఉండగా.. వచ్చే సోమవారం సీఎం పినరయి విజయన్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరుగనుంది.

ఇందులో మరిన్ని ఆంక్షలపై నేతలతో సీఎం చర్చించనున్నట్లు సమాచారం. ఈ నెల 21న జారీ చేసిన ఉత్తర్వుల్లో ప్రభుత్వం అన్ని కార్యాలయాలు, బ్యాంకులు, ప్రభుత్వ రంగ సంస్థలకు 24న సెలవు ప్రకటించనున్నట్లు పేర్కొంది. 25న సైతం అత్యవసర సేవలు మాత్రమే అనుమతి ఉంటుందని స్పష్టం చేసింది. ఇదిలా ఉండగా.. శుక్రవారం కేరళలో 28,447 కరోనా కేసులు నమోదయ్యాయి. రోజు వారీ కొవిడ్ కేసుల్లో ఇదే అత్యధికం. ప్రస్తుతం 1.78 లక్షల మంది మహమ్మారి బారినపడి చికిత్స పొందుతున్నారని ప్రభుత్వం తెలిపింది.

వ్యాక్సిన్లు, ఆక్సిజన్, సంబంధిత సామగ్రిపై కస్టమ్స్ డ్యూటీ మాఫీ

ఢిల్లీ, ఏప్రిల్ 24: : కొవిడ్ వ్యాక్సిన్లు, ఆక్సిజన్ దిగుమతిపై కస్టమ్స్ సుంకం, ఆరోగ్య సెస్‌ను మూడు నెలల కాలానికి తక్షణమే మాఫీ చేస్తున్నట్లు కేంద్రం ప్రకటించింది. దేశంలో కరోనా మహమ్మారి, ఆక్సిజన్ అందుబాటుపై శనివారం మధ్యాహ్నం ప్రధాని మోదీ అధ్యక్షతన ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం జరిగింది. దేశంలో ఆక్సిజన్ లభ్యతను పెంచేందుకు తీసుకున్న చర్యలను ప్రధాని ఈ సందర్భంగా సమీక్షించారు. మెడికల్ ఆక్సిజన్, ఆక్సిజన్ ఉత్పత్తి పరికరాలు, క్రిటికల్ కేర్ యూనిట్లో రోగులకు ఉపయోగించే పరికరాల దిగుమతిపై సుంకాన్ని ఎత్తేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని వెల్లడించారు.

సిద్దిపేట ముఖాన్ని మార్చిన పార్టీకే ఓటేయండి

సిద్దిపేట, ఏప్రిల్ 24: : సిద్దిపేట ముఖాన్ని మార్చి పట్టణాన్ని అభివృద్ధిలో పరుగులు పెట్టించిన పార్టీకే ప్రజలు ఓటేయాల్సిందిగా మెదక్ టీఆర్ఎస్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి కోరారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారంలో భాగంగా 14వ వార్డులో టీఆర్ఎస్ పార్టీ శనివారం ఇంటింటి ప్రచారం నిర్వహించింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు సిద్దిపేటను ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దారన్నారు.

కొమటిచెరువును అందమైన ప్రదేశంగా తీర్చిదిద్దడం, అనేక ప్రదేశాల్లో ఓపెన్ జిమ్‌లు ఏర్పాటు చేయడం, పాదచారుల కోసం రోడ్ల వెంట ఫుట్‌పాత్‌ల నిర్మాణం ఇలా ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టారన్నారు. అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థను కలిగిన అతికొద్ది పట్టణాల్లో సిద్దిపేట ఒకటన్నారు. రాష్ట్రంలోనే వ్యర్థాల నిర్వహణలో తొలిస్థానంలో ఉందన్నారు. గత ఏడేండ్లలో టీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించి పనిచేసే ప్రభుత్వానికి ఓటేయాల్సిందిగా ఎంపీ కోరారు.

చరిత్రలో నేటినిజం

తం॥ ఈ మోసపు ఆట చాసిగ
ప్రేమ ఖుర్బాన్ గల నిజాము రాజన్నోనిగా
శేషమిలో పెట్టగాంబుచు
క్షేమం కటుపైనిలచె నసిరుద్దౌలా !!

(ఏప్రిల్ 25 ఒకనాటి హైదరాబాదు నవాబు నసీరు ద్దౌలా జయంతి..)

-రాధశ్రీ

సెల్: 9494481210

దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆక్సీజన్ ఉత్పత్తిదారుల తో వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా మాట్లాడిన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ

హైదరాబాద్ ఏప్రిల్ 24:దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ఆక్సీజన్ ఉత్పత్తిదారుల తో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా ఒక సమావేశాన్ని నిర్వహించారు. ఈ కాలం సవాళ్ల కు ఎదురొడ్డవలసింది మాత్రమే కాక అతి తక్కువ సమయం లో పరిష్కారాల ను అందించవలసిన కాలం కూడా అని ప్రధాన మంత్రి శ్రీ మోదీ ఈ సందర్భం లో అన్నారు. ఆక్సీజన్ ఉత్పత్తిదారుల కు, ప్రభుత్వానికి మధ్య మంచి సమన్వయాన్ని కొనసాగించుకోవలసిన అవసరం ఉందని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్పష్టం చేశారు.

గత కొన్ని వారాల లో ఆక్సీజన్ ఉత్పత్తిదారులు వారి ఉత్పత్తి ని పెంచినందుకు ప్రధాన మంత్రి వారిని అభినందించారు. లిక్విడ్ ఆక్సీజన్ ఉత్పత్తి ని అధికం చేయడానికి అనేక చర్యలను తీసుకోవడాన్ని ఆయన గుర్తించారు. పరిశ్రమల లో వినియోగించే ఆక్సీజన్ ను దేశం లో వైద్య సంబంధి అవసరాలను తీర్చడం కోసం మళ్లించినందుకు పరిశ్రమ రంగానికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ధన్యవాదాలను కూడా వ్యక్తం చేశారు.

స్థితి ని మరింత మెరుగుపరచడం కోసం, రాబోయే రోజుల లో ఆక్సీజన్ కు ఏర్పడే డిమాండు ను తట్టుకోవడం కోసం పరిశ్రమ తాలూకు పూర్తి సామర్థ్యాన్ని వినియోగం లోకి తీసుకు రావలసిన అంశాన్ని గురించి ప్రధాన మంత్రి ప్రస్తావించారు. ఆక్సీజన్ సిలిండర్ ల అందుబాటు ను వృద్ధి చెందించలసిన అవసరం ఉందని, అలాగే ఆక్సీజన్ రవాణా కు గల లాజిస్టిక్స్ సదుపాయాల ను ఉన్నతీకరించవలసిన అవసరం కూడా ఉందని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. ఇతర వాయువుల ను రవాణా చేయడానికి ఉద్దేశించినటువంటి ట్యాంకర్ లను ప్రాణవాయువు సరఫరా కు వాడవలసిందిగా పరిశ్రమ కు ఆయన విజ్ఞప్తి చేశారు.ఆక్సీజన్ కు సంబంధించినంతవరకు రాష్ట్రాల అవసరాల ను పట్టించుకొంటూ, ట్యాంకర్ లు సాధ్యమైనంత త్వరగా ఉత్పత్తి కేంద్రానికి చేరుకొనేటట్టుగా రైల్వేస్ ను, వాయు సేన ను ప్రభావవంతమైనటువంటి పద్ధతి లో ఉపయోగించుకోవడం పై ప్రభుత్వం దృష్టి ని సారిస్తోందని ప్రధాన మంత్రి చెప్పారు.ప్రభుత్వం, రాష్ట్రాలు, పరిశ్రమ, రవాణాదారులు, అన్ని ఆసుపత్రులు కలిసికట్టుగా ముందడుగు వేస్తూ ఏక స్థాయి లో కృషి చేయవలసిన అవసరం ఉందని ప్రధాన మంత్రి చెప్పారు.

సమన్వయం ఎంత బాగుంటే, ఈ సవాలు ను ఎదుర్కోవడం అంత గా సులభతరం అవుతుంది అని ఆయన అన్నారు.ఆక్సీజన్ ఉత్పత్తిదారుల ను ప్రధాన మంత్రి శ్రీ మోదీ అభినందిస్తూ, వారికి ప్రభుత్వ సమర్థన పూర్తి గా ఉంటుందన్నారు; ఈ సంకటం తో పోరాడడం లో దేశం త్వరలో సఫలం కాగలుగుతుందన్న ఆశ ను ఆయన వ్యక్తం చేశారు.ఈ సమావేశం లో ఆర్ఐఎల్ సిఎమ్ డి శ్రీ ముకేశ్ అంబాని, ఎస్ఎఐఎల్ చైర్ పర్సన్ శ్రీమతి సోమ మండల్, జెఎస్ డబ్ల్యు కు చెందిన శ్రీ సజ్జన్ జిందల్, టాటా స్టీల్ కు చెందిన శ్రీ నరేంద్రన్, జెఎస్ పిఎల్ కు చెందిన శ్రీ నవీన్ జిందల్, ఎఎమ్ఎన్ఎస్ కు చెందిన శ్రీ దిలీప్ ఊమెన్, లిండే కు చెందిన శ్రీ ఎమ్. బనర్జీ, ఐనాక్స్ కు చెందిన శ్రీ సిద్ధార్థ్ జైన్, ఎయర్ వాటర్ జమ్ షెడ్ పుర్ ఎమ్ డి శ్రీ నోరియో శిబుయ, నేశనల్ ఆక్సీజన్ లిమిటెడ్ కు చెందిన శ్రీ రాజేశ్ కుమార్ శరాఫ్, ఆల్ ఇండియా ఇండస్ట్రియల్ గేసెస్ మేన్యుఫాక్చరర్స్ అసోసియేశన్ అధ్యక్షుడు శ్రీ సాకేత్ టికూ లు పాల్గొన్నారు.

వైకుంఠదామం నిర్మాణ అభివృద్ధి పనుల పరిశీలన..

హైదరాబాద్ ఏప్రిల్ 24: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో భవ్యాస్ అపార్టుమెంట్ ఎదురుగా వైకుంఠ దామం నిర్మాణ అభివృద్ధి పనులను కమీషనర్ గోపి, సీనియర్ నాయకులు కోలన్ గోపాల్‌రెడ్డిలు, ఆవుల జగన్‌యాదవ్‌లు పర్యవేక్షించారు. నిలిచిపోయిన నిర్మాణ అభివృద్ధి పనులు త్వరగతిన పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పనులను త్వరగా పూర్తి చేయిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో డిఇ సుబ్రహ్మణ్యం, ఇంజనీరింగ్ విభాగం శ్రీనివాస్‌రెడ్డి, ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొవిడ్ వ్యాక్సిన్ రెండో డోస్ తీసుకున్న నితిన్ గడ్కరీ

ఢిల్లీ, ఏప్రిల్ 24: కేంద్ర రోడ్డు రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ కొవిడ్ వ్యాక్సిన్ రెండో డోస్ తీసుకున్నారు. శనివారం నాడు ఆయన ఎయిమ్స్, నాగపూర్‌లో వ్యాక్సిన్ రెండో డోస్ తీసుకున్నారు. మార్చి 6వ తేదీ గడ్కరీ తన మొదటి డోస్ వ్యాక్సిన్ తీసుకున్నారు. అదేవిధంగా పశ్చిమ బెంగాల్ గవర్నర్ జగదీప్ దంఖర్ కూడా ఈవాళ కమాండ్ హాస్పటల్‌లో కొవిడ్ వ్యాక్సిన్ రెండో డోస్ తీసుకున్నారు. వైద్య సిబ్బందికి ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

మధ్యధరా సముద్రంలో బోటు మునక.. 130 మంది దుర్మరణం..!

కైరో, ఏప్రిల్ 24:: మధ్యధరా సముద్రంలో ఘోర పడవ ప్రమాదం జరిగింది. ఆఫ్రికా నుంచి యూరప్ చేరుకోవటం కోసం రబ్బర్ బోటులో వెళ్తున్న 130 మంది శరణార్థులు మధ్యధరా సముద్రంలో మునిగిపోయి ప్రాణాలు కోల్పోయారని ఐక్యరాజ్య సమితి శరణార్థి సంస్థ తెలిపింది. 130 మందితో గురువారం యూరోప్‌కు బయలుదేరిన ఓ రబ్బర్ పడవను అధికారులు లిబియా రాజధాని ట్రిపోలి సమీపంలో శనివారం గుర్తించారు.

బోటు దగ్గరకు వెళ్లి చూడగా అందులో ప్రయాణికులు లేరు. కానీ, ఆ బోటు చుట్టూ పదికిపైగా శవాలు నీటిపై తేలుతూ కనిపించాయి. దాంతో వారంతా మరణించి ఉంటారని ఐక్యరాజ్యసమితి వలసదారుల సంక్షేమ విభాగం వెల్లడించింది. అదేవిధంగా ట్రిపోలికి తూర్పున మరో రెండు రబ్బర్ పడవలను గుర్తించినట్లు లిబియన్ కోస్ట్ గార్డ్ తెలిపింది. దీంతో ప్రత్యేక పడవలను అక్కడికి పంపి వాటిలోని 106 మందిని రక్షించినట్లు అధికారులు వెల్లడించారు. పేదరికం, అంతర్యుద్ధం కారణంగా ఆఫ్రికాలో బతుకడం దుర్భరంగా మారుతుండటంతో చాలామంది మెరుగైన జీవితం కోసం మధ్యధరా సముద్రం గుండా యూరప్‌లోకి అక్రమంగా చొరబడుతున్నారు. ఇందుకోసం రబ్బరు బోట్లను ఆశ్రయిస్తున్నారు.

కరోనా విజృంభనతో మలేరియాను నిర్లక్ష్యం చేయవద్దు..!

(25 ఏప్రిల్ 'ప్రపంచ మలేరియా దినం' సందర్భంగా)

ప్రపంచవ్యాప్తంగా ఐక్యరాజ్యసమితి సభ్యదేశాలు 2007 నుంచి 25 ఏప్రిల్ రోజున 'ప్రపంచ మలేరియా దినం' నిర్వహించుట ఆనవాయితీగా వస్తున్నది. 2000 సంవత్సరం నుంచి మలేరియా నిర్మూలన, రోగ నిర్ధారణ, వైద్యరంగాల్లో ప్రపంచ దేశాలు గుణాత్మక ఫలితాలను సాధించి, పిల్లలను మరియు పెద్దలను మలేరియా నుంచి కాపాడటం జరుగుతోంది. గత రెండు దశాబ్దాలుగా 7 మిలియన్ల ప్రజలను మలేరియా నుంచి కాపాడటం మరియు 1 బిలియన్ జనులకు మలేరియా సోకకుండా చర్యలు తీసుకోవడం జరిగింది. 'ప్రపంచ మలేరియా దినం -2021' నినాదంగా 'మలేరియా రహిత యజ్ఞంలో నేను ప్రథముడిగా నిలుస్తాను (జీరో మలేరియా స్టార్ట్ విత్ మీ)' అనే అంశాన్ని మరియు 'మలేరియా వ్యతిరేక లక్ష్మణరేఖలు గీద్దాం' అనే అంశాన్ని యువత కేంద్రంగా తీసుకొని సామాన్యులకు అవగాహన కల్పిస్తున్నారు. రాబోయే రోజుల్లో దాదాపు అన్ని ప్రపంచదేశాలు 'జీరో మలేరియా' దేశాలుగా రూపాంతరం చెందే దిశలో అడుగులు వేయడం సంతోషదాయకం. ప్లాస్మోడియం పరాన్నజీవి వల్ల సంక్రమించే మలేరియా ప్రాణాంతకమైన వ్యాధిగా గుర్తించబడింది. ఆడ అనాఫిలిస్ దోమ కాటు వల్ల మానవులకు సోకే మలేరియా అభివృద్ధి చెందుతున్న భారత్ లాంటి అధిక జనాభా కలిగిన దేశాల్లో ప్రమాదకరంగా మారడం విచారకరం. విశ్వవ్యాప్తంగా గత నాలుగు సంవత్సరాలుగా ప్రతి ఏటా 229 మిలియన్ల ప్రజలు కొత్తగా మలేరియా బారిన పడుతున్నారని 'ప్రపంచ మలేరియా నివేదిక-2020' తేల్చింది. 2019లో 4.09 లక్షల మలేరియా మరణాలను ప్రపంచవ్యాప్తంగా గమనించారు. వరుసగా 3 ఏండ్ల మలేరియా కేసులు నమోదుకాని దేశాలను 'మలేరియా రహిత దేశాలు'గా ఐరాస ప్రకటిస్తున్నది. 2007లో యూఏఈ, 2016లో శ్రీలంక లాంటి 9 దేశాలను ఐరాస జీరో మలేరియా దేశాలుగా ప్రకటించింది. విశ్వవ్యాప్తంగా 106 దేశాలకు సంబంధించిన 3.3 బిలియన్ల జనులు మలేరియా బారిన పడే ప్రమాదపు అంచున ఉన్నారు. ప్రపంచ మలేరియా నివేదిక ప్రకారం 2018లో ప్రపంచ మలేరియా కేసుల్లో 93 శాతం ఆఫ్రికా దేశాల్లోనే బయట పడటం మరియు 94 శాతం మరణాలు రికార్డు కావడం జరిగింది.

ప్రపంచ దేశాలు మలేరియా నిర్మూలనకు అవిశ్రాంతంగా కృషి చేస్తున్నాయని, కొన్ని దేశాలు 'మలేరియా రహిత దేశాలు'గా ప్రకటించబడ్డాయని ఐక్యరాజ్యసమితి అభినందన పూర్వకంగా హర్షాన్ని వ్యక్తం చేసింది. 2025 నాటికి మరో 25 దేశాలు మలేరియా రహిత దేశాల జాబితాలో చేరేందుకు పటిష్టమైన కార్యాచరణ అమలు పరుస్తున్నాయి. మలేరియా కేసులు బయట పడుతున్న 87 దేశాల్లో 46 దేశాలు 2019లో 10 వేల కన్న తక్కువ కేసులను నమోదు చేశాయని, 2000లో 26 దేశాలు మాత్రమే ఉన్నాయని ఐరాస గుర్తు చేసింది. 2020 నాటికి మరో 24 దేశాలు గత 3 ఏండ్లుగా మలేరియా కేసులు నమోదు కాకుండా ఉన్నాయని, వీటిలో 11 దేశాలు మలేరియా రహిత దేశాల జాబితాలో చేరాయని వివరించింది. అనేక దశాబ్దాలుగా మానవాళిని పట్టి పీడిస్తున్న భయంకర మలేరియా వ్యాధిని కట్టడి చేయడానికి అంతర్జాతీయ సమాజం నడుం బిగించడం సంతోషదాయకం. మలేరియా నివారణకు వివిధ దేశాలు వివిధ రకాలైన కార్యాచరణలను అమలు పరచడంలో సఫలీకృతం కావడం గమనిస్తున్నాం. మలేరియా కట్టడికి ప్రభుత్వ రాజకీయ నిర్ణయం ప్రధానమైందిగా గుర్తించారు. మలేరియాను సమర్థవంతంగా కట్టడి చేయడానికి దోమల నిర్మూలన, పరిసరాల పరిశుభ్రత, వ్యాధి నిర్ధారణ మరియు సరైన చికిత్సల పట్ల ప్రభుత్వాలు సకారాత్మక చర్యలు తీసుకోవడంతో పాటుగా అవసర నిధుల కేటాయింపు సమయానుకూలంగా జరగాలి. చైనా, ఇరాన్, మలేషియా లాంటి మరో 8 దేశాలు 2020 నాటికి 'జీరో మలేరియా' దేశాలుగా గుర్తించబడినవి. భూటాన్, కోస్టారికా మరియు నేపాల్‌లు ఏడాదికి 100 లోపు కేసుల నమోదుతో మలేరియా రహిత దేశాల జాబితాలో చేరేందుకు సిద్ధంగా ఉన్నాయి.

1947లో భారత్ జనాభా 330 మిలియన్లు ఉండగా, అందులో ప్రతి ఏటా 75 మిలియన్ల ప్రజలకు మలేరియా సోకడం జరిగింది. 1994లో కేసుల సంఖ్య 2.51 మిలియన్ మరియు మరణాలు 0.99 మిలియన్ గుర్తించారు. అక్టోబర్-2020 వరకు 1.57 లక్షల మలేరియా కేసులు నమోదు కాగా, 2019లో 2.86 లక్షలు నమోదైనాయ్. 2000లో 29,500 మరణాలు నమోదు కాగా 2019లో మలేరియా మరణాల సంఖ్య గణనీయంగా పడిపోయి 7,700 లకు చేరడం శుభ పరిణామంగా గుర్తించారు. ఇండియాలో మలేరియా లాంటి 'వాహక జీవి ద్వారా కలిగే వ్యాధి (వెక్టర్ బార్న్ డిసీజెస్)' జాబితాలో డెంగ్యూ, ఫైలేరియాసిస్, కాలా-ఆజర్, జపనీస్ ఎన్సిఫలైటిస్ మరియు చికెన్ గున్యా లాంటి ప్రమాదకర రోగాలు దేశ వైద్యరంగానికి సవాళుగా నిలిచాయి. ఐరాస రూపొందించిన 'ప్రపంచ మలేరియా నివేదిక-2020' గణాంకాల ప్రకారం ఇండియాలో మలేరియా నివారణ చర్యలు సత్ఫలితాలు ఇస్తున్నాయని తేల్చింది. 2018 గణాంకాలతో పోల్చితే 2019లో మలేరియా కేసులు 21.3 శాతం మరియు మరణాలు 20 శాతం తగ్గాయని తెలుస్తున్నది. ఇండియాలో 2000-19 మధ్య రెండు దశాబ్దాల కాలంలో మలేరియా కేసులు 83.34 శాతం మరియు మరణాలు 92 శాతం తగ్గడంతో 'మిలినియమ్ డెవలప్‌మెంట్ గోల్స్ - 6' సాధించటంలో సఫలమైనట్లు గమనించారు. మన దేశంలో పశ్చిమ బెంగాల్, ఝార్ఖండ్, ఛత్తీస్‌గఢ్ మరియు యంపీల్లో అధిక మలేరియా కేసులను గమనించి, 'హై బర్డన్ టు హై ఇంపాక్ట్' ప్రణాళికలను అమలుపరిచారు. 2027 నాటికి ఇండియాను 'మలేరియా రహిత దేశం'గా ప్రకటించడానికి అనేక పటిష్ట కార్యక్రమాలను ప్రభుత్వాలు చేపట్టడం జరుగుతోంది. మలేరియాకు కారణమైన దోమ కాటును నివారించడం ప్రథమ కర్తవ్యంగా భావించాలి. దోమ కాటు నివారణకు దోమ తెరలు, దోమలను వికర్షించే క్రీమ్‌లు/ద్రవాలు/కాయిల్స్/మ్యాట్స్ వాడటం, శరీర అవయవాలు కప్పుకునేలా దుస్తువులు ధరించడం, డోర్‌లకు నెట్స్ అమర్చుకోవడం లాంటి ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడానికి మురికి నీటి నిల్వలు లేకుండా స్వచ్ఛ భారత్ నిర్వహించడం లాంటివి మలేరియా నిర్మూలనకు దోహదపడతాయి. మలేరియా నివారించదగిన వ్యాధి. సరైన అనగాహనతో అడ్డుకట్ట వేయడానికి కొన్ని జాగ్రత్తలు తీసుకుంటే సరిపోతుంది. మలేరియా సోకినా భయపడకుండా అందుబాటులో ఉన్న సరైన చికిత్సతో సకాలంలో వైద్య సలహాలు తీసుకుంటే ప్రాణాపాయం తప్పుతుంది. కరోనా విజృంభనతో మలేరియా లాంటి ప్రాణాంతక వ్యాధులను నిర్లక్ష్యం చేస్తే భారీ మూల్యం చెల్లించాల్సి రావచ్చని మరువరాదు. మలేరియాకు చికిత్స కన్న నివారణే సులభమని గమనిస్తూ, మలేరియా రహిత భారతదేశ నిర్మాణంలో మనందరం చేయి చేయి కలిపి ఆరోగ్య భారతాన్ని సుసాధ్యం చేద్దాం.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

భారతదేశంలో వేసవి పంటల విస్తీర్ణం పెరుగుతోంది

హైదరాబాద్ ఏప్రిల్ 23: రైతుల కృషితో పాటు, రాష్ట్రాలు మరియు కేంద్ర ప్రభుత్వం యొక్క ఖచ్చితమైన ప్రణాళిక మరియు సమిష్టి కృషి ఫలితంగా, వరుసగా రెండవ సంవత్సరం కూడా దేశవ్యాప్తంగా వేసవి పంటల విస్తీర్ణం పెరుగుతున్న ధోరణి కనిపిస్తోంది. పంటలు, ముతక తృణధాన్యాలు, పోషక-తృణధాన్యాలు మరియు నూనెగింజలు వంటి వేసవి పంటలను శాస్త్రీయంగా పండించడానికి వ్యవసాయ మరియు రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ కొత్త కార్యక్రమాలు చేపట్టింది.23 ఏప్రిల్ 2021 నాటికి దేశంలో వేసవి సాగు గత ఏడాది కంటే 21.5% ఎక్కువ నమోదయింది. వేసవి పంట మొత్తం విస్తీర్ణం ఏడాది క్రితం 60.67 లక్షల హెక్టార్లు కాగా ఈ ఏడాది 73.76 లక్షల హెక్టార్లకు పెరిగింది. పప్పుధాన్యాల సాగులోగణనీయమైన పెరుగుదల కనిపించింది. 23 ఏప్రిల్ 2021 నాటికి పప్పుధాన్యాల సాగు 6.45 లక్షల హెక్టార్లు నుండి 12.75 లక్షల హెక్టార్లకు పెరిగింది, ఇది దాదాపు 100% పెరుగుదలను చూపుతుంది. పెరిగిన ప్రాంతం ప్రధానంగా తమిళనాడు, మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, గుజరాత్, బీహార్, ఛత్తీస్‌గడ్, మహారాష్ట్ర, కర్ణాటక మొదలైన రాష్ట్రాల నుండి నివేదించబడింది.

నూనె గింజలు 9.03 లక్షల హెక్టార్లు నుండి 10.45 లక్షల హెక్టార్లకు పెరిగాయి. ఇది సుమారు 16% పెరుగుదల. పశ్చిమ బెంగాల్, కర్ణాటక, గుజరాత్, మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, ఛత్తీస్‌గడ్ ప్రాంతాల నుండి ఈ పెరుగుదల కనిపించింది

వరి 33.82 లక్షల హెక్టార్లు నుండి 39.10 లక్షల హెక్టార్లకు పెరిగింది. ఇది సుమారు 16% పెరుగుదల. పశ్చిమ బెంగాల్, తెలంగాణ, కర్ణాటక, అస్సాం, ఆంధ్రప్రదేశ్, ఒడిశా, ఛత్తీస్‌గడ్, తమిళనాడు, బీహార్, మొదలైన రాష్ట్రాల నుండి రబీ సాగు నమోదైంది.

వేసవి సాగు మే మొదటి వారం నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. వేసవి పంటలు అదనపు ఆదాయాన్ని అందించడమే కాక, ఉపాధి అవకాశాలను కూడా సృష్టిస్తాయి. వేసవి పంటల సాగు ద్వారా ఒక ప్రధాన లాభం , ముఖ్యంగా పప్పుధాన్యాల పంట ద్వారా నేల ఆరోగ్యంలో మెరుగుదల.

దాదాపు అన్ని జలాశయాలలో నీటి మట్టాలను ప్రోత్సహించడం రబీ పంటతో పాటు వేసవి పంటలను కూడా రక్షించడంలో సహాయపడింది. తద్వారా మొత్తం ఉత్పాదకత ఉత్పత్తి గణనీయంగా పెరుగుతుందని అంచనా వేస్తున్నారు.

నేల తేమ మరియు ఇతర వాతావరణ పరిస్థితుల ఆధారంగా వేసవి / జైద్ పంటలను పెంచడం భారతదేశంలో పాత పద్ధతి, ముఖ్యంగా ఆహార ధాన్యాల అదనపు దేశీయ అవసరాలను తీర్చడం మరియు పశువులకు ఆహారం ఇవ్వడం వీటి లక్ష్యం. నీటి లభ్యత ఆధారంగా రైతులు తమ దేశీయ వినియోగం కోసం కొన్ని రాష్ట్రాల్లో వేసవి వరి పంటలను సాగు చేస్తారు. శాస్త్రీయ సాగు పద్ధతులను ఉపయోగించడం ద్వారా రైతులు విత్తనాలను ప్రాసెస్ చేసిన తర్వాత విత్తన డ్రిల్ / సున్నా ద్వారా వేసవి పంటలను సాగు చేయడం ప్రారంభించారు. రైతులు అధిక దిగుబడినిచ్చే రకాలను పండించడం ద్వారా అధిక ఉత్పాదకత మరియు ఆర్థిక లాభాల కోసం పంటకోత విలువ అదనంగా సాంకేతికతలను ఉపయోగించడం ప్రారంభించారు.

సాగు ప్రణాళికను అభివృద్ధి చేయడానికి 2021 జనవరి లో జైద్ జాతీయ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో సవాళ్లు, అవకాశాలు మరియు వ్యూహాలపై రాష్ట్రాలతో చర్చ జరిగింది. ఆ తరువాత ఉత్పత్తిని పెంచడానికి, విత్తనాలు మరియు ఎరువుల సమీకరణ వంటి ఇన్‌పుట్లను సకాలంలో ఏర్పాటు చేయడానికి సిబ్బందిని నియమించడం జరిగింది. వాటిలో సాంకేతిక మద్దతు, రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయాలు (ఎస్ఏయులు) మరియు కృషి విజ్ఞాన కేంద్రాలు (కెవికెలు) మధ్య సన్నిహిత సమన్వయం నిర్ధారించబడింది. ఇవి జిల్లా మరియు క్షేత్ర స్థాయిలో ముఖ్యమైనవి.

ఆక్సిజన్ కొరతతో పంజాబ్ ఆసుపత్రిలో ఆరుగురు రోగులు మృతి

చండీగఢ్, ఏప్రిల్ 24: : పంజాబ్‌లోని ప్రైవేట్ ఆసుపత్రిలో ఆక్సిజన్ కొరతతో ఆరుగురు రోగులు మరణించారు. ఇందులో ఐదుగురు కరోనా రోగులని ఆసుపత్రి వర్గాలు వెల్లడించాయి. అమృత్‌సర్‌లోని నీల్‌కాంత్ హాస్పిటల్‌లో శనివారం ఈ ఘటన జరిగింది. ఆసుపత్రిలో ఆక్సిజన్ సిలిండర్ల కొరత గురించి జిల్లా అధికారులకు చెప్పినప్పటికీ పట్టించుకోలేదని ఆసుపత్రి ఛైర్మన్ సునీల్ దేవ్‌గన్ ఆరోపించారు. దీంతో ఆక్సిజన్ లేక ఆరుగురు రోగులు చనిపోయారని చెప్పారు. ఇందులో ఇద్దరు మహిళలని వెల్లడించారు.

ఆరుగురు రోగులు మరణించిన తర్వాత కేవలం ఐదు ఆక్సిజన్ సిలిండర్లను సరఫరా చేశారని సునీల్ తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు తొలుత ప్రభుత్వ ఆసుపత్రులకు ఆక్సిజన్ సరఫరాకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు సరఫరాదారులు చెబుతున్నారని పేర్కొన్నారు. మరోవైపు ఆక్సిజన్ కొరతతో రోగులు చనిపోయిన ఘటనపై దర్యాప్తు చేస్తున్నట్లు పంజాబ్ మంత్రి ఓపీ సోని తెలిపారు.

కరోనా ఎఫెక్ట్ : పూరి జగన్నాథ్ ఆలయం మూసివేత

భువనేశ్వర్ ఏప్రిల్ 24: దేశంలో కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో ఒడిశాలోని పూరి జగన్నాథ ఆలయం మూతపడింది. ఆలయాన్ని మే 15 వరకు మూసివేసి ఉంచనున్నట్లు ఆలయం అధికారులు తెలిపారు. కరోనా ఇన్‌ఫెక్షన్ కారణంగా పూరి జగన్నాథ్ ఆలయంలో వివిధ సమస్యలు తలెత్తుతాయని, ఇక్కడికి వచ్చే భక్తులతో వైరస్ వ్యాప్తి చెందే అవకాశాలు ఉన్నాయని ఆలయం బోర్డు అభిప్రాయపడింది. జగన్నాథ్ ఆలయంలో భక్తుల దర్శనం కొనసాగితే రాబోయే రోజుల్లో మరింత ప్రభావితం కావచ్చునని, అటువంటి పరిస్థితిలో పూరి జగన్నాథ్ ఆలయాన్ని మూసివేయడమే మంచిదని నిర్ణయించారు.

జగన్నాథ్ ఆలయ చీఫ్ అడ్మినిస్ట్రేటర్ కిషన్ కుమార్ అధ్యక్షతన శనివారం వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ఏర్పాటు చేసిన సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ సమావేశంలో శ్రీమందిర్ వివిధ నిజోగ్ సీనియర్ సేవకులు, జిల్లా కలెక్టర్ సమర్త్ వర్మ, ఎస్పీ కున్వర్ విశాల్ సింగ్, శ్రీమందిర్ కార్యాలయం అధికారులు పాల్గొన్నారు.

పూరీ జగన్నాథ్ ఆలయంలో భక్తుల రాకను నిషేధించారని, రాబోయే రోజుల్లో అన్ని కార్యక్రమాలు ప్రణాళికాబద్ధంగా పూర్తవుతాయని సేవకులు తెలిపారు. మహాప్రభు చందన్ యాత్ర, అక్షయ తృతీయ, స్నాన్ యాత్ర, ప్రపంచ ప్రఖ్యాత రథయాత్ర రాబోయే రోజుల్లో జరుగనున్నాయి. అటువంటి పరిస్థితుల్లో బ్రేక్ వర్తించకపోతే ఇన్‌ఫెక్షన్ పెరిగిపోయి అసలుకే ముప్పు వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

మరోవైపు, సాంప్రదాయం ప్రకారం ఈ ఏడాది రథం నిర్మాణ పనుల కొనసాగింపును మే 15 న అక్షయ తృతీయ రోజున ప్రారంభించనున్నారు. ఆలయంలో సేవకులకు మాస్కులు, శానిటైజర్లు ఏర్పాటు చేయనున్నా. చందనం, స్నానం, రథయాత్ర కోసం ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. కరోనా ఇన్‌ఫెక్షన్ రాష్ట్రంలో వేగంగా పెరుగుతున్నది. పూరి జిల్లాలో శుక్రవారం 395 మందికి కరోనా సోకినట్లు గుర్తించారు.

విరార్ ఆసుపత్రి లో మంటలు రేగి ప్రాణనష్టం జరగడం పట్ల సంతాపాన్ని వ్యక్తం చేసిన ప్రధాన మంత్రి

హైదరాబాద్ ఏప్రిల్ 24:విరార్ లోని కోవిడ్-19 ఆసుపత్రి లో మంటలు చెలరేగిన కారణం గా ప్రాణనష్టం జరగడం పట్ల ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సంతాపాన్ని వ్యక్తం చేశారు. గాయపడ్డ వారు త్వరగా కోలుకోవాలని ఆయన ఆకాంక్షించారు. మహారాష్ట్ర లోని విరార్ లో ఆసుపత్రి లో మంట లు రేగిన ఘటన లో ప్రాణాలను కోల్పోయిన వారి దగ్గరి సంబంధికులకు ప్రధాన మంత్రి జాతీయ సహాయ నిధి (పిఎమ్ఎన్ఆర్ఎఫ్) నుంచి రెండు లక్షల రూపాయల చొప్పున సహాయక రాశి ని మంజూరు చేసేందుకు ప్రధాన మంత్రి ఆమోదం తెలిపారు. తీవ్రం గా గాయపడ్డ వారికి 50,000 రూపాయల చొప్పున ఆర్థిక సహాయాన్ని అందించడం జరుగుతుంది.

2021 మే, జూన్ నెలల్లో ప్రధాన మంత్రి గరిబ్ కల్యాణ్ అన్న యోజన ఆధ్వర్యంలో ఎన్ఎఫ్ఎస్ఏ లబ్ధిదారులకు అదనంగా ఉచిత ఆహార ధాన్యాలు పంపిణీ చేయబడతాయి

హైదరాబాద్ ఏప్రిల్ 24:ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి పేదల పట్ల ఉన్న నిబద్ధతకు అనుగుణంగా జాతీయ ఆహార భద్రతా చట్టం, 2013 (ఎన్ఎఫ్ఎస్ఏ) పరిధిలో ఉన్న దాదాపు 80 కోట్ల మంది లబ్ధిదారులకు నెలకు 5 కిలోల చొప్పు ఉచిత ఆహార ధాన్యాలు కేటాయించాలని భారత ప్రభుత్వం నిర్ణయించింది. మునుపటి "ప్రధాన మంత్రి గరిబ్ కల్యాణ్ అన్న యోజన (పిఎం-జికెఎవై) మాదిరిగానే వచ్చే రెండు నెలలు అంటే మే మరియు జూన్ 2021 వరకు ఎన్ఎఫ్ఎస్ఏ ఆహార ధాన్యాలు పైన ఇది అమలవుతుంది.

ఈ ప్రత్యేక పథకం (పిఎమ్జికెఎ) కింద ఎన్ఎఫ్ఎస్ఎ యొక్క రెండు వర్గాల పరిధిలో ఉన్న 80 కోట్ల ఎన్ఎఫ్ఎస్ఎ లబ్ధిదారులకు, అంత్యోదయ అన్న యోజన (ఎఎవై) మరియు ప్రయారిటీ హౌస్‌హోల్డర్స్ (పిహెచ్‌హెచ్), అదనపు కోటా ఉచిత ఆహార ధాన్యాలు (బియ్యం/గోధుమ)తో అందించబడతాయి. ఎన్ఎఫ్ఎస్ఏ కింద వారి సాధారణ నెలవారీ అర్హతలకు అదనంగా నెలకు 5 కిలోల చొప్పున అందిస్తారు.

రాష్ట్రాలు/యుటిలకు కేంద్ర సహాయంలో భాగంగా ఆహార ధాన్యాలు, అంతర్రాష్ట్ర రవాణా మొదలైన వాటిపై భారత ప్రభుత్వం రూ .26 వేల కోట్లకు పైగా ఖర్చు చేస్తుంది.

కోవిడ్-19 కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రంగంలోకి భారత వైమానిక దళం

హైదరాబాద్ ఏప్రిల్ 24:కోవిడ్-19ని కట్టడి చేయడానికి జరుగుతున్న ప్రయత్నాలలో భారత వైమానిక దళం రంగంలోకి దిగింది. కోవిడ్-19 కేసుల సంఖ్య పెరుగుతున్న నేపథ్యంలో దేశం వివిధ ప్రాంతాలలో అవసరమైన ప్రాంతాలకు ఆక్సిజన్ కంటైనర్లు, సిలిండర్లు, అత్యవసర మందులు, పరికరాలను చేర్చడానికి వైమానిక దళం తన యుద్ధ విమానాలను రంగంలోకి దింపింది. వైమానిక దళ రవాణా విమానాలు, హెలికాప్టర్లను దీనికోసం ఉపయోగిస్తున్నారు. సి -17, సి -130 జె, ఐఎల్ -76, అన్ -32 , అఫ్రో రవాణా విమానాలు దేశం వివిధ ప్రాంతాల నుంచి అవసరమైన ప్రాంతాలకు సిలిండర్లు, అత్యవసర మందులు, పరికరాలను చేరుస్తున్నాయి. అవసరమైతే వినియోగించడానికి చినూక్ మరియు మి -17 హెలికాప్టర్లను సిద్ధంగా ఉంచారు. కొచ్చి, ముం

వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి గెలుపు ఖాయం..

హైదరాబాద్ ఏప్రిల్ 24:కుత్బుల్లాపూర్ వరంగల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బిజెపి గెలుపు ఖాయమని రాష్ట్ర బిజెపి నాయకులు, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, జోనల్ ఎన్నికల ఇంచార్జి కూన శ్రీశైలంగౌడ్ ధీమా వ్యక్తం చేశారు. కార్పొరేషన్ పరిధిలోని 5,6,7 డివిజన్లలో భారతీయ జనతా పార్టీ 5 వ డివిజన్ అభ్యర్థి అనిశెట్టి రంజిత్, 6 వ డివిజన్ అభ్యర్థి రాజేంద్ర ప్రసాద్, 9 వ డివిజన్ అభ్యర్థి భాగ్యలక్ష్మీలను గెలిపించాలని ఆయన ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా కూన శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ వరంగల్ కార్పొరేషన్ డివిజన్ ప్రజలందరూ కమలం గుర్తు పై ఓట్లు వేసి అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను కోరారు. వరంగల్‌లో వరద ముంపుకు గురి అయితే నగరాన్ని టీఆర్ఎస్ ప్రభుత్వం ప్రజలను గాలికొదిలేశారని ఎన్నికల ముందే ఏవేవో వాగ్దానాలు చెప్పి ఎన్నికల సందర్భంగా మళ్ళీ ప్రజల ముందుకు టీఆర్ఎస్ నాయకులు వస్తున్నారన్నారు. వరంగల్ నగరాన్ని కేంద్ర ప్రభుత్వం స్మార్ట్ సిటీగా సాంక్షన్ చేస్తే కనీసం టీఆర్ఎస్ ప్రభుత్వం గాలికి వదిలేసిందన్నారు. కేంద్రం ప్రభుత్వ అధికారులతో మాట్లాడి బండి సంజయ్ మన నగరానికి స్మార్ట్ సీటీ తీసుకొచ్చారని ..ఇప్పటికైనా ప్రజలు ఆలోచించి కమలం గుర్తుపై ఓటు వేయాలని కోరారు.. గతంలో వరదల సమయంలో జీహెచ్ఎంసీలో కూడా ప్రజలను పట్టించుకోకపోవడం పట్ల బిజెపి అధ్యక్షులు బండి సంజయ్ పోరాటం చేస్తే హైదరాబాద్ నగరంలో భారతీయ జనతా పార్టీకి 48 మంది కార్పొరేటర్లను ప్రజలు గెలిపించుకున్నారన్నారు. వరంగల్‌లో కూడా టీఆర్ఎస్ ప్రభుత్వానికి ఓట్ల రూపంలో ప్రజలు బుద్ధి చెప్పాలని ఓటర్లను కూన శ్రీశైలంగౌడ్ కోరారు. ఈ కార్యక్రమంలో సహాయక ప్రీతంరెడ్డి, ఇంచార్జీలు శ్రీనివాస్, అనుప్, రాజమౌళి, డివిజన్ల, ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించిన ఆర్డీఓ..

ఆదిలాబాద్, ఏప్రిల్ 25: బెల్లంపల్లి ఆర్డీఓ శ్యామలదేవి తాండూరు తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పలు రికార్డులను పరిశీలించారు. గ్రీవెన్స్‌లో వచ్చే ధరఖాస్తుల పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదుదారులు ఫిర్యాదు చేసుకున్న భూముల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. ప్రజావాణిలో వచ్చే ధరఖాస్తులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. ఆమె వెంట ఇంచార్జి తహశిల్దార్ మానిక్‌రావు, ఆర్ఐ ఎజాజ్ ఉద్దిన్, సిబ్బంది ఉన్నారు.

కరోనా బాధితులకు నిత్యావసర సరుకులు..

ఆదిలాబాద్, ఏప్రిల్ 25:మండలంలోని కోమటిచేను గ్రామపంచాయితీ పరిధిలో గల రేగులగూడెంకు చెందిన కరోనా బాధితులకుఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు మధుసుదన్ రెడ్డి నిత్యావసర సరుకులను అందజేశారు. పత్రికల ద్వారా ఆ గ్రామంలోని 56 మందికి కరోనా సోకగా వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలుసుకొని వారిని ఆదుకునేందుకు తనవంతు సహాయంగా గ్రామంలోని 30 కుటుంబాలకు 15 రోజులకు సరిపడా నిత్యావస సరుకులను అందజేయడంతో పాటు మాస్కులను, శానిటైజర్లను గ్రామస్తులకు అందజేశారు. కరోనా నుండి రక్షణ కోసం ప్రతీఒక్కరు వ్యాక్సినేషన్ వేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మధుసుదన్ రెడ్డితో పాటు గ్రామ సర్పంచ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అధిక భారం ఉన్న రాష్ట్రాల ముఖ్యమంత్రులతో కోవిడ్-19 స్థితిపై ప్రధాన మంత్రి సమావేశం

హైదరాబాద్ ఏప్రిల్ 24: ఇటీవల గరిష్ఠ సంఖ్య లో కేసులు నమోదు అయిన 11 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల ముఖ్య మంత్రుల తో కోవిడ్-19 స్థితి పై జరిగిన ఒక ఉన్నత స్థాయి సమావేశానికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అధ్యక్షత వహించారు.

వైరస్ అమాంతం రెండో అంచె నగరాలు, మూడో అంచె నగరాల తో సహా అనేక రాష్ట్రాల పై ప్రభావాన్ని చూపుతోందని గమనించిన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఈ మహమ్మారి తో సామూహిక బలాన్ని ఉపయోగించి కలసికట్టుగా పోరాడదామంటూ పిలుపునిచ్చారు. మహమ్మారి ఒకటో దశ లో భారతదేశం సాధించిన సాఫల్యానికి మన ఉమ్మడి ప్రయాస లు, సమష్టి వ్యూహం అతి పెద్ద మూల కారణం అని ఆయన చెప్తూ, ఈ సవాలు ను మనం ఇదే పద్ధతి లో పరిష్కరించాలి అన్నారు.

ఈ పోరాటం లో అన్ని రాష్ట్రాల కు కేంద్ర పూర్తి మద్దతు ను ఇస్తుంది అని ప్రధాన మంత్రి హామీ ని ఇచ్చారు. రాష్ట్రాల తో ఆరోగ్య మంత్రిత్వ శాఖ సంప్రదింపులు జరుపుతూ, స్థితి ని సన్నిహితంగా పర్యవేక్షిస్తోంది, ఎప్పటికప్పుడు రాష్ట్రాల కు అవసరమైనటువంటి సూచనల ను, సలహాల ను అందిస్తోంది అని కూడా ఆయన అన్నారు.

ఆక్సీజన్ సరఫరా పై, రాష్ట్రాలు ప్రస్తావించిన అంశాల ను ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ శ్రద్ధ గా ఆలకించారు. ఆక్సీజన్ సరఫరా ను పెంచడం కోసం అదే పని గా కృషి జరుగుతోంది అని ఆయన అన్నారు. ప్రభుత్వం లోని సంబంధిత మంత్రిత్వ శాఖలు, సంబంధిత విభాగాలు ఒక్కటై పాటుపడుతున్నాయన్నారు. పరిశ్రమల లో ఉపయోగించే ఆక్సీజన్ ను కూడా తక్షణ అవసరాల ను తీర్చడం కోసం మళ్లించడం జరుగుతోందన్నారు.

మందుల కు, ఆక్సీజన్ కు సంబంధించిన అవసరాల ను నెరవేర్చడం కోసం రాష్ట్రాలు అన్నీ కూడా కలసికట్టుగా పనిచేయాలి, ఒక రాష్ట్రం తో మరొక రాష్ట్రం సమన్వయాన్ని నెలకొల్పుకోవాలి అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ విజ్ఞప్తి చేశారు. ఏ ఆక్సీజన్ ట్యాంకరు - అది ఏ రాష్ట్రానికి ఉద్దేశించింది అయినప్పటికీ - మార్గమధ్యం లోనే దానిని ఆపివేయడమో, లేదా దారి లో అది చిక్కుకోవడమో జరగకుండా ప్రతి ఒక్క రాష్ట్రం శ్రద్ధ తీసుకోవాలి అని ప్రధాన మంత్రి అన్నారు.

ఆక్సీజన్ ను రాష్ట్రం లోని వివిధ ఆసుపత్రుల కు తీసుకు పోవడం కోసం ఒక ఉన్నత స్థాయి సమన్వయ సంఘాన్ని ఏర్పాటు చేయవలసిందిగా అని రాష్ట్రాల ను ప్రధాన మంత్రి కోరారు. కేంద్రం నుంచి ఆక్సీజన్ కేటాయింపు జరిగిన వెను వెంటనే, ఆ ఆక్సీజన్ ను అవసరం మేరకు రాష్ట్రం లోని వివిధ ఆసుపత్రుల కు బట్వాడా అయ్యే విధంగా ఈ సమన్వయ సంఘం పూచీ పడాలి అన్నారు. ఆక్సీజన్ సరఫరా అంశం పై నిన్నటి రోజు న జరిగిన ఒక సమావేశానికి తాను అధ్యక్షత వహించినట్లు, ఆక్సీజన్ సరఫరా ను పెంచేందుకు గల అన్ని ఐచ్ఛికాలను గురించి చర్చించడం కోసం ఈ రోజు న మరొక సమావేశానికి హాజరు కానున్నట్లు ముఖ్యమంత్రుల కు ప్రధాన మంత్రి తెలియజేశారు.

ఆక్సీజన్ ట్యాంకర్ ల ప్రయాణ సమయాన్ని, వాటి రాకపోకల కు పట్టే కాలాన్ని తగ్గించడం కోసం సాధ్యమైనటువంటి అన్ని రకాల ఐచ్ఛికాల పైన కేంద్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. దీనికై, ఆక్సీజన్ ఎక్స్ ప్రెస్ ను రైల్వేస్ ఆరంభించినట్లు ఆయన చెప్పారు. ఖాళీ అయిన ఆక్సీజన్ ట్యాంకర్ లను కూడా- వాటి ఒక వైపు ప్రయాణ సమయాన్ని తగ్గించేందుకు- వాయు సేన ద్వారా చేరవేయడం జరుగుతోంది అని ప్రధాన మంత్రి వివరించారు.

వనరుల ఉన్నతీకరణ కు తోడు గా, పరీక్షలు చేయించడం పైన మనం శ్రద్ధ వహించవలసి ఉంది అని ప్రధాన మంత్రి అన్నారు. పరీక్షల నిర్వహణ ను విస్తృత స్థాయి కి చేర్చాలి, అది జరిగితే, ప్రజలు పరీక్ష సదుపాయాన్ని సులభం గా అందుకోగలుగుతారు అని ఆయన స్పష్టం చేశారు.

టీకాల ను వేయించేందుకు మనం చేపట్టినటువంటి కార్యక్రమం ఈ స్థితి లో నెమ్మదించ కూడదు అని ప్రధాన మంత్రి అన్నారు. భారతదేశం ప్రపంచం లోనే అతి పెద్ద టీకాకరణ కార్యక్రమాన్ని నడుపుతోంది, మరి ఇంతవరకు 15 కోట్ల కు పైగా టీకా మందు డోసుల ను రాష్ట్రాల కు ఉచితం గా భారత ప్రభుత్వం సమకూర్చింది అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రస్తావించారు. ఆరోగ్య సంరక్షణ కార్యకర్తల కు, ఫ్రంట్ లైన్ వర్కర్ లకు, అలాగే 45 ఏళ్ల వయస్సు పైబడిన పౌరులు అందరికీ ఉచితం గా వ్యాక్సీన్ ను అందజేయడానికి కేంద్ర ప్రభుత్వం మొదలుపెట్టిన కార్యక్రమం కూడా అదే విధం గా కొనసాగుతుంది అని ప్రకటించారు. 18 ఏళ్ల వయస్సు పైబడిన పౌరులు అందరికీ మే నెల ఒకటో తేదీ నాటి నుంచి టీకా మందు అందుబాటు లోకి వస్తుంది అని కూడా ఆయన తెలిపారు. వీలయినంత ఎక్కువ మంది టీకా మందు ను పొందే లాగా మనం ఉద్యమ తరహా లో శ్రమించవలసిన అవసరం కూడా ఉంది అని ఆయన అన్నారు.

రోగుల చికిత్స కు అన్ని చర్యలను తీసుకోవడం తో పాటు, ఆసుపత్రుల లో సురక్షత కూడా చాలా ముఖ్యం అని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు. ఆక్సీజన్ లీకేజి తాలూకు ఇటీవలి ఘటన ల పట్ల, ఆసుపత్రుల లో మంటలు రేగడం పట్ల ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దు:ఖాన్ని వ్యక్తం చేస్తూ, భద్రత సంబంధి ప్రోటోకాల్స్ విషయం లో ఆసుపత్రి పాలన సిబ్బంది కి మరింత అధిక జాగృతి ని కలిగించవలసిన అవసరం ఎంతయినా ఉందన్నారు.

ప్రజలు గాభరా తో కొనుగోళ్ల కు ఒడిగట్టకుండా పాలన యంత్రాంగం ప్రజల ను ఎల్లప్పటికీ చైతన్యవంతులను చేస్తూ ఉండాలి అని కూడా ప్రధాన మంత్రి విజ్ఞప్తి చేశారు. మనం సమష్టి ప్రయాసల తో మహమ్మారి రెండో వేవ్ దేశం అంతటా విస్తరించకుండా అడ్డుకోగలుగుతాం అని ఆయన అన్నారు.

అంతక్రితం, సంక్రమణ ల కొత్త ఉధృతి ని నిలువరించడం కోసం చేపడుతున్న సన్నాహక చర్యల ను వివరించే ఒక నివేదిక ను డాక్టర్ వి.కె. పాల్ సమావేశానికి సమర్పించారు. వైద్య సదుపాయాల ను పెంచడానికి, అలాగే రోగుల కు లక్షిత చికిత్స ను అందించడానికి సంబంధించిన ఒక మార్గ సూచీ ని కూడా డాక్టర్ పాల్ సమావేశానికి నివేదించారు. వైద్య పరమైనటువంటి మౌలిక సదుపాయాల ను, వైద్య బృందాల ను, సరఫరా లను పెంపొందించడం, రోగ చికిత్స సంబంధి నిర్వహణ, కట్టడి, టీకా మందు ను ఇప్పించడం, సముదాయాల ను భాగస్వాముల ను చేయడం వంటి అంశాలను గురించిన వివరాలను ఆయన ప్రతి ఒక్కరికి తెలియజేశారు.సంభాషణ సాగిన క్రమం లో, ప్రస్తుత వేవ్ లో ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకొంటున్న చర్యల ను గురించి ముఖ్యమంత్రులు ప్రధాన మంత్రి దృష్టి కి తీసుకు వచ్చారు. ప్రధాన మంత్రి ఇచ్చిన ఆదేశాలు, 'నీతి' అందజేసిన మార్గ సూచీ తాము తమ ప్రతిస్పందనలను ఒక పద్ధతి లో అమలుపరచడం లో తోడ్పా?టు ను అందించ గలుగుతాయన్న అభిప్రాయాన్ని కూడా వారు వ్యక్తం చేశారు.

కేంద్ర ఆరోగ్య మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ అధ్యక్షతన జరిగిన మలేరియా నిర్మూలన కోసం ఏర్పాటు చేసిన "రీచింగ్ జీరో" ఫోరమ్"

హైదరాబాద్ ఏప్రిల్ 24:ప్రపంచ మలేరియా డే సందర్భంగా మలేరియా నిర్మూలన కోసం ఏర్పాటైన "రీచింగ్ జీరో" ఫోరమ్‌సమావేశానికి కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ హర్షవర్ధన్ ఈ రోజు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.ప్రతి సంవత్సరం, ఏప్రిల్ 25న 'ప్రపంచ మలేరియా దినోత్సవం' గా పాటిస్తారు. ఈ సంవత్సరం ప్రధాన అంశం "జీరో మలేరియా లక్ష్యాన్ని చేరుకోవడం.' '

ఈ సందర్భంగా డాక్టర్ హర్షవర్ధన్ మాట్లాడుతూ ఈ సంవత్సరం వేడుకల కు ప్రత్యేకమైన ప్రాధాన్యతా అంశాన్ని (థీమ్) ఎంచుకున్నందుకు ఫోరమ్‌ను అభినందించారు "ఈ థీమ్ మా దేశానికి చాలా ముఖ్యమైనది. ఎందుకంటే మేము దేశమంతటా మలేరియాను నిర్మూలించడానికి, మెరుగైన ఆరోగ్య వసతులు కల్పించడానికి, పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్నాం. ప్రపంచ మలేరియా దినోత్సవ వేడుకలు అంతర్జాతీయ సమాజానికి ఈ ప్రాణాంతక వ్యాధిని నిర్మూలించడానికి , వారి ప్రజల ఆరోగ్యాన్ని, జీవనోపాధిని మెరుగుపర్చడానికి కృషి చేస్తున్న అన్ని ప్రభావిత దేశాలకు కూడా ప్రేరణనిస్తాయి '' అని అన్నారు. భారతదేశం నుండి ఈ వ్యాధిని తొలగించడానికి ప్రభుత్వం చేస్తున్న నిరంతర ప్రయత్నాల గురించి ఆయన మాట్లాడుతూ, '' మలేషియాలో 2015లో జరిగిన ఈస్ట్ ఏషియా సమిట్ సందర్భంగా ఆసియా పసిఫిక్ నాయకుల కూటమి మలేరియా నిర్మూలన మార్గదర్శక ప్రణాళికను ఆమోదించిన 18 మంది అంతర్జాతీయ నాయకులలో భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ కూడా ఉన్నారు. 2030 నాటికి ఈ ప్రాంతం మలేరియా రహితంగా ఉండేలా కూటమి నాయకత్వం లక్ష్యాన్ని నిర్దేశించుకుంది" అని చెప్పారు.

ప్రధానమంత్రి నాయకత్వంలో ఈ దిశగా సాధించిన విజయాలను కూడా ఆయన వివరించారు: కేసుల పరంగా మలేరియా భారాన్ని 84.5శాతం, మరణాలను 83.6శాతం తగ్గించి దేశం గొప్ప విజయాన్ని సాధించగలిగిందని 2018, 2019, 2020 సంవత్సరాల మలేరియా నివేదికలు వెల్లడించాయన్నారు ''బలమైన రాజకీయ నిబద్ధత వల్లే భారతదేశం మలేరియా నిర్మూలనలో విజయవంతం అయిందని ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రశంసించింది. కీటకాల వ్యాధుల నియంత్రణ చర్యలకు ప్రాధాన్యత ఇచ్చారని , నిర్మూలన వ్యూహాలను సమర్థవంతంగా అమలు చేయడానికి దేశీయ నిధులను పెంచడంపై దృష్టి పెట్టారని పేర్కొంది" అని మంత్రి వివరించారు. 2020 లో దేశంలో 116 జిల్లాల్లో సున్నా మలేరియా కేసులు నమోదయ్యాయంటూ సంబంధిత రాష్ట్రాలు, జిల్లాలన్నింటినీ అభినందించారు. ఈ అద్భుత ఘనతను సాధించడానికి భారతదేశానికి సహకరించిన అందరు అధికారులను, సంస్థలను హర్షవర్ధన్ అభినందించారు.

కరోనా మహమ్మారి సమయంలో ఆరోగ్య కార్యకర్తలు ఎన్నో విజయాలను సాధించారని డాక్టర్ హర్షవర్ధన్ పేర్కొన్నారు. "కొవిడ్ మహమ్మారి వల్ల భారీ ప్రజారోగ్య సవాళ్లు ఉన్నప్పటికీ, ఆరోగ్య సంరక్షణలో వివిధ మంచి పద్ధతులను పాటించాం. కరోనా రహిత అత్యవసర వైద్యసేవల కోసం సమగ్ర విధానాన్ని పాటించాం. మలేరియా నిరోధక కార్యక్రమాలను కొనసాగిస్తున్నాం. అన్ని స్థాయిలలో మందులు, వైద్య పరీక్షల పరికరాలు అందుబాటులో ఉండేలా చూస్తున్నాం. ఛత్తీస్‌గఢ్ బస్తర్ రీజియన్‌లో మలేరియా ముక్త్ అభియాన్‌ను విజయవంతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 37.8 లక్షల మందికి మలేరియా పరీక్షలు చేశారు. అంతేగాక 2.52 కోట్ల మందికి దోమతెరలను పంపిణీ చేశారు"అని మంత్రి విశదీకరించారు. కరోనా మహమ్మారి సమస్యలు ఉన్నప్పటికీ, మలేరియా నిర్మూలన కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వాల మరింత ముందుకు తీసుకెళ్తాయని ఆశాభావం వ్యక్తం చేశారు. దీనివల్ల మలేరియా నిర్మూలన చర్యలు మందగించబోవని అన్నారు. "చురుకైన సమాజ భాగస్వామ్యం, అన్ని రంగాల సమన్వయంతో, 2030 నాటికి భారతదేశం మలేరియా నిర్మూలన లక్ష్యాన్ని సాధిస్తుంది" అని డాక్టర్ హర్షవర్ధన్ చెప్పారు. కార్యక్రమానికి ఎన్హెచ్ఎం అదనపు కార్యదర్శి డ ఎండి వందనా గుర్నాని, జాయింట్ సెక్రటరీ (విబిడి) ఎంఎస్ రేఖ శుక్లా, డిజిహెచ్ఎస్ డాక్టర్ సునీల్ కుమార్, ఇతర ఆరోగ్య విభాగాల సీనియర్ అధికారులు కూడా హాజరయ్యారు. భారత్లో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ రోడ్రిక్ ఆఫ్రిన్ తన సంస్థ తరఫున ప్రాతినిధ్యం వహించారు.

గ్రామ సచివాలయ వ్యవస్థ అద్భుతం.. ఏపీకి 17 అవార్డులు సొంతం

అమరావతి, ఏప్రిల్ 23: జాతీయ పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా కేంద్రం ప్రకటించే అవార్డులలో ఈ ఏడాది ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఏకంగా 17 అవార్డులను దక్కించుకుంది. పంచాయతీరాజ్ దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శనివారం ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ముఖ్యమంత్రి వైఎస్ జగన్, పంచాయతీ రాజ్ శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పాల్గొన్నారు. అవార్డుల పోటీలో దేశవ్యాప్తంగా 74 వేల గ్రామ పంచాయతీలు పోటీ పడ్డాయి.

ఏపీకి 17 అవార్డులు రావడం పట్ల మంత్రి పెద్దిరెడ్డి ఆనందం వ్యక్తం చేశారు. దేశంలో ఎక్కువ అవార్డులు వచ్చిన నాలుగో రాష్ట్రం ఏపీ అని ఆయన చెప్పారు. గుంటూరు, కృష్ణా జిల్లా పరిషత్‌లకు అవార్డులు వచ్చాయని మంత్రి పెద్దిరెడ్డి తెలిపారు. ఈ-గవర్నెన్స్ కింద ఆంధ్రప్రదేశ్‌కు అవార్డు వచ్చిందన్నారు. సీఎం జగన్ తీసుకొచ్చిన.. గ్రామ సచివాలయ వ్యవస్థ పనితీరు అద్భుతంగా ఉందని మంత్రి పెద్దిరెడ్డి చెప్పారు.

కొవిడ్ కేసుల్లో భారీ పెరుగుదల వల్ల ఏర్పడుతున్న పరిస్థితులపై కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా సమీక్ష; వైద్య ఆక్సిజన్ సరఫరాను పెంచేలా వివిధ చర్యలకు ఆదేశం

హైదరాబాద్ ఏప్రిల్ 25: పెరుగుతున్న కొవిడ్ కేసుల కారణంగా వైద్య ఆక్సిజన్‌కు డిమాండ్ పెరుగుతున్న నేపథ్యంలో, ప్రస్తుత పరిస్థితులపై కేంద్ర హోం మంత్రి శ్రీ అమిత్ షా సమీక్షించారు. వైద్య చికిత్సలకు ఆక్సిజన్ సరఫరాను పెంచేలా వివిధ చర్యలకు ఆదేశించారు. దీని ప్రకారం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల అవసరాలకు తగ్గట్లుగా ఆక్సిజన్ కేటాయింపులను ఒక నిపుణుల బృందం పర్యవేక్షిస్తోంది. దీంతోపాటు, క్రియాశీల కేసులను దృష్టిలో ఉంచుకుని ఆక్సిజన్ పంపిణీ సమయం తగ్గేలా చూస్తోంది.

దేశవ్యాప్తంగా వైద్య అవసరాలకు ఆక్సిజన్ సరఫరాలో ఆటంకాలు రాకుండా చూడాలని, విపత్తుల నిర్వహణ చట్టం-2005 ప్రకారం, రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను ఈ నెల 22వ తేదీ హోం మంత్రిత్వ శాఖ ఆదేశించింది. ఈ ఆదేశానికి కట్టుబడి ఉండాలని, ఆక్సిజన్ సరఫరా వాహనాలకు తగిన భద్రత కల్పించాలని, రవాణా కోసం ప్రత్యేక మార్గాలు ఉండేలా నిబంధనలు రూపొందించాలని, ఆక్సిజన్ సరఫరా వాహనాలను కూడా అంబులెన్సుల్లాగే పరిగణనించాలని మంత్రిత్వ శాఖ సూచించింది.

కొన్ని అత్యవసర రంగాలకు తప్ప, పారిశ్రామిక అవసరాలకు ఆక్సిజన్ సరఫరాను నిషేధిస్తూ, ఈ నెల 18వ తేదీన కేంద్ర ప్రభుత్వం ఆదేశం వెలువరించింది. వైద్య ఆక్సిజన్ పెంపును ఈ ఆదేశం గణనీయంగా మెరుగుపరుస్తుంది. పారిశ్రామిక ఆక్సిజన్ వినియోగాన్ని మరింత తగ్గించడానికి కేంద్రం చర్యలు తీసుకుంటోంది. దీనివల్ల వైద్య చికిత్సలకు ఆక్సిజన్ సరఫరా పెరుగుతుంది.

జిల్లాల్లో వివిధ రకాల ఆక్సిజన్‌లను ఉత్పత్తి చేస్తున్న సంస్థలు, వాటి స్థాపన సామర్థ్యంతో ఒక జాబితా రూపొందించేలా కలెక్టర్లు లేదా ఉప కమిషనర్లను ఆదేశించాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలను హోం మంత్రిత్వ శాఖ నిర్దేశించింది. మూతబడిన సంస్థలను తిరిగి తెరిపించే చర్యలు కూడా తీసుకోవాలని సూచించింది. సాధారణ మార్గాల ద్వారా రవాణాతోపాటు, జిల్లా స్థాయుల్లోనూ వైద్య ఆక్సిజన్ సిద్ధంగా ఉండేలా ఈ చర్యలు భరోసానిస్తాయి.

ఆమోదించిన కేటాయింపు ప్రణాళిక ప్రకారం దేశవ్యాప్తంగా వైద్య ఆక్సిజన్ సరఫరాను కేంద్ర హోం శాఖ కల్పిస్తోంది. రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు ఆక్సిజన్ చేరిన తర్వాత ఖాళీ అయిన ట్యాంకర్లను జాప్యం లేకుండా తిరిగి ఉత్పత్తి ప్రాంతాలకు చేర్చేందుకు వైమానిక దళం రంగంలోకి దిగింది. ఆక్సిజన్ పంపిణీకి అదనపు ట్యాంకర్లను అందుబాటులో ఉంచేందుకు, సింగపూర్, యూఏఈ వంటి దేశాల నుంచి అధిక సామర్థ్యంగల ట్యాంకర్లను వైమానిక దళ రవాణా విమానాల ద్వారా మంత్రిత్వ శాఖ తెప్పిస్తోంది. ఆక్సిజన్ ట్యాంకర్లున్న ప్రత్యేక రైళ్లను రైల్వే మంత్రిత్వ శాఖ మరింత వేగంగా నడుపుతోంది.

వైద్య ఆక్సిజన్‌ను సమర్థంగా వినియోగించేలా చూసేందుకు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలతో కేంద్ర హోం మంత్రిత్వ శాఖ, కేంద్ర ఆరోగ్య డ కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాయి. వైద్య ఆక్సిజన్, అత్యవసర మందుల వృథా జరగకుండా క్రమం తప్పకుండా మదింపు చేస్తున్నాయి.

క్రీడకారుడుకి ఆర్థిక సాయం..

హైదరాబాద్ ఏప్రిల్ 25: నేపాల్‌లో ఈ నెల 28 నుండి 30 వరకు నిర్వహించనున్న ఇండో- నేపాల్ నేషనల్ ఫెడరేషన్ కప్ యూత్ రూరల్ గేమ్స్ 2021-22 భాగంగా ఇండియా కబడ్డీ అండర్ -17 జట్టుకు భౌరంపేట్ గ్రామంకి చెందిన సాయి వర్ధన్‌రెడ్డి ఎంపికయ్యారు. పేదరికం కావడంతో ప్రయాణ ఖర్చుల నిమిత్తం రంగారెడ్డి జిల్లా ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజు కార్యాలయంలో సీనియర్ టీఆర్ఎస్ నాయకులు ధర్మారెడ్డి చేతుల మీదుగా రూ. 50 వేలు ఆర్థిక సహాయం అందించారు.

వ్యాక్సీన్ తప్పక వేయించుకోవాలి..

కరీంనగర్. ఏప్రిల్ 25:(నేటినిజం ప్రతినిధి):ముత్తారం ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి ఒక్కరూ కరోనా వ్యాక్సీన్‌ను తప్పక వేయించుకోవాలని జిల్లా ఉప వైద్యాధికారి డాక్టర్ రాజమౌళి పేర్కొన్నారు. మండలంలోని ఖమ్మంపల్లి గ్రామంలో కరోనా వ్యాక్సీనేషన్ ప్రక్రియను పరిశీలించి వైద్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. 45 ఏళ్ల వారందరికి కరోనా వ్యాక్సీన్ తప్ప వేయాలని సూచించారు. అలాగే మండలంలో ప్రజలంతా భౌతిక దూరం పాటిస్తూ మాస్కులు ధరించాలని కోరారు. ఈకార్యక్రమంలో మండల వైద్యాధికారి డాక్టర్ వంశీకృష్ణ, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రైవేటు ఉపాధ్యాయులకు బియ్యం పంపిణీ..

రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్ 25: (నేటినిజం ప్రతినిధి):కరోనా మహమ్మారి నేపథ్యంలో ఉపాధి కోల్పోయిన ప్రైవేట్ ఉపాధ్యాయులకు శనివారం సన్న బియ్యాన్ని పంపిణీ చేశారు, ఉపాధి కోల్పోయిన ప్రైవేట్ ఉపాధ్యాయులను ఆదుకునేందుకు తెలంగాణ ప్రభుత్వం 2000 రూపాయలు బియ్యాన్ని ప్రకటించగా ఇట్టి కార్యక్రమాన్ని వేములవాడ విలీన గ్రామమైన శాత్రా జపల్లి లో ప్రైవేట్ ఉపాధ్యాయులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో టీఆర్ఎస్ నాయకులు గుడిసెసదానందం,మూలె బుచ్చిబాబు రేగుల రాజేష్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షులు సంగ స్వామియాదవ్, డీలర్ల చెర్ల రమేష్, నాయిని రవి ,మనోజ్ కుమార్, శేఖర్ ,విశాల్ ,జన్ తదితరులు పాల్గొన్నారు

గ్రామ పంచాయితీల పనితీరు భేష్ : భారత ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ

-పంచాయితీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకుని వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించిన ప్రధాని

-జాతీయ పంచాయతీ పురస్కారాలకు ఎంపికైన గ్రామ పంచాయితీలకు అభినందన

రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్ 25: (నేటినిజం ప్రతినిధి):గ్రామ పంచాయితీలు సమర్థవంతంగా పని చేస్తున్నాయని పంచాయితీల పనితీరు భేష్ అని భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ అభివర్ణించారు.జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం దేశ ప్రధాని నరేంద్ర మోడీ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ కు జిల్లా నుండి జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్, జిల్లా పరిషత్ చైర్మన్ న్యాలకొండ అరుణ, అదనపు కలెక్టర్ బి.సత్య ప్రసాద్, జిల్లా పంచాయతీ అధికారి రవీందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి కౌటిల్య అలాగే ఇటీవల జాతీయ పంచాయతీ పురస్కారాలకు ఎంపికైన ముస్తాబాద్ మండలం మోహిని కుంట గ్రామపంచాయతీ సర్పంచ్ కల్వకుంట్ల వనజ, ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ తెడ్డు అమృత లు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ గ్రామ పంచాయితీల పనితీరు అభినందనీయమని కొనియాడారు. కేంద్ర ప్రభుత్వం పెద్దఎత్తున గ్రామపంచాయతీలకు నేరుగా నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జాతీయ పంచాయతీ పురస్కారాలకు ఎన్నికైన గ్రామపంచాయతీలకు సమావేశం నుండే నేరుగా ఆన్ లైన్ లో నిధులు విడుదల చేశారు.

ప్రతి ఏటా ఏప్రిల్ 24న జాతీయ పంచాయతీ రాజ్ దినోత్సవాన్ని దేశ రాజధానిలో నిర్వహించి పంచాయతీ పురస్కారాల విజేతలకు నేరుగా ప్రధానితో అవార్డుల ప్రదానం నిర్వహించడం ఆనవాయితీ కాగా, ఈ సంవత్సరం కోవిడ్ విజృంభిస్తున్న కారణంగా ఈ కార్యక్రమాన్ని ఆన్ లైన్ లో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నిర్వహించారు. అవార్డుకు సంబంధించిన షీల్డు మరియు సరిఫికెట్లు ముందుగానే జిల్లాలకు పంపించారు.అనంతరం పొదుపు భవన్ లో జాతీయ పంచాయతీ పురస్కారాల్లో చైల్డ్ ఫ్రెండ్లీ అవార్డు కైవసం చేసుకున్న మోహినికుంటగ్రామపంచాయతీ సర్పంచ్ కల్వకుంట్ల వనజ, ఎల్లారెడ్డిపేట మండలం హరిదాస్ నగర్ గ్రామపంచాయతీ సర్పంచ్ తెడ్డు అమృత లకు జిల్లా కలెక్టర్ కృష్ణ భాస్కర్, జెడ్పీ చైర్మన్ అరుణ, అదనపు కలెక్టర్ బి.సత్యప్రసాద్ లు అవార్డులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో ముస్తాబాద్ మండల జెడ్పీటీసీ గుండం నర్సయ్య, ఎల్లారెడ్డిపేట జడ్పీటీసీ చీటీ లక్ష్మణ్ రావు, ఎంపీపీ పిల్లి రేణుక ఎంపీడీవోలు చిరంజీవి, రమాదేవి, ఎంపీఓ లు, సంబంధిత గ్రామాల పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆత్మరక్షణ విద్య కరాటేలో రాణిస్తూఎన్నో పతకాలు సాధించిన విద్యార్థులకు, కరాటే మాస్టర్ కు సన్మానం

రాజన్న సిరిసిల్లా, ఏప్రిల్ 25: (నేటినిజం ప్రతినిధి):కడెం మండలం నవాబుపేట్ గ్రామం లోని పేద,మధ్యతరగతి కుటుంబానికి చెందిన ఎందరో విద్యార్థులు ఒకినావ మార్షల్ ఆర్ట్స్ అకాడెమీనిర్మల్ డిస్ట్రిక్ట్ స్టైల్ చీఫ్ కొమురవెల్లి భూమేశ్ ఆధ్వర్యంలో శిక్షణ పొందుతున్న విద్యార్థినిలు కె.శ్రీదేవి జె.శ్రీహర్షినిలు ఇద్దరు ఈ మధ్య కాలంలో అంతర్జాతీయ కరాటే పోటీల్లో స్వర్ణ పతకాలు సాధించారు.

జాతీయ అంతర్జాతీయ స్థాయిలో రాణిస్తున్న xవిద్యార్థినిలను ఇద్దరిని, వారి తల్లిదండ్రులను నవాబుపేట్ గ్రామ సర్పంచ్ తాల్లపెల్లి విజయ, ఉపసర్పంచ్ అవునూరి రాజేశ్, పంచాయతీ సెక్రెటరీ వీరాధి గిరిధర్ , వార్డ్ సభ్యులు జెల్ల లావణ్యశంకరయ్య ,గ్రామస్థులు ఘనంగాసన్మానించారు.

అదేవిధంగా అంతర్జాతీయ స్థాయిలో రాణించేలా శిక్షణ ఇస్తున్న ఒకినావ కరాటే మాస్టర్ కొమురవెల్లి భూమేశ్ ను అభినందించారు.ఈకార్యక్రమంలో తల్లిదండ్రులుజుట్టుమంగశంకరయ్య ,కొమురవెల్లిసిరిచందనరమేశ్ ,ఉపాధ్యాయులు బి.పణీన్ద్ర, జి.విజయ్ కుమార్ మపెద్దలుగ్రామస్థులు గంట్యాల రాయలింగు, జుట్టు రాజన్న ఈ.రాజశేఖర్ ,ఫీల్డ్ అసిస్టెంట్ అజయ్ , పలువురు పాల్గొన్నారు.

అర్హులందరికీ వ్యాక్సిన్..

కరీంనగర్. ఏప్రిల్ 25:(నేటినిజం ప్రతినిధి):పెద్దపల్లి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మార్గదర్శకాలకు అనుగుణంగా 45, ఆపై వయసు కలిగిన వారంతా తప్పనిసరిగా కోవిడ్ వ్యాక్సీన్ను తీసుకోవాలని పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ తిరుపతి పిలుపునిచ్చారు. పట్టణంలోని చందపల్లిలో రాగినేడు పీహెచ్సీ ఆధ్వర్యంలో నిర్వహించిన కోవిడ్ వ్యాక్సినేషన్ను ఆయన పరిశీలించారు. భౌతికదూరం పాటించి వ్యాక్సీన్ తీసుకోవాలని కోరారు. ఈకార్యక్రమంలో పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర్ ఫణీంద్ర, కౌన్సిలర్లు నెత్తెట్ల స్వరూప కుమార్, రాజం మహంత కృష్ణ, సూపర్వైజర్లు జగన్నాథం, ఎలిజబెత్ రాణి, సిబ్బంది శ్రావణ్కుమార్, ఆశా వర్కర్లు రజిత, శోభ, లతలు పాల్గొన్నారు. అలాగే మారేడుగొండలో రాఘవాపూర్ పీహెచ్సీ ఆధ్వర్యంలో వ్యాక్సీనేషన్ నిర్వహించారు. ఈకార్యక్రమంలో డాక్టర్ మమత, హెచ్ఈఓ ఉమామహేశ్వర్, సర్పంచ్ కన్నం జైతదితరులు పాల్గొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత..

కరీంనగర్. ఏప్రిల్ 25:(నేటినిజం ప్రతినిధి)జూలపల్లి మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీకి చెందిన నిరుపేద కుటుంబానికి మానుమండ్ల లచ్చయ్య నెల రోజుల క్రితం మృతిచెందగా ఏగోళపు కుమార్ గౌడ్ ట్రస్టు చేయూతనందించారు. ట్రస్టు అధ్యక్షుడు సదయ్య గౌడ్ బాధిత కుటుంబానికి బియ్యం, నిత్యావసర సరుకులను అందించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అమరగాని ప్రదీప్ కుమార్ గౌడ్, సుద్దాల నాగరాజు, ఆడేపు నవీన్, లంక అరుణ్ కుమార్, జిల్లాల శ్రీకాంత్, మనుమండ్ల వినయ్, కల్లెపల్లి మల్లయ్య, భాషంపల్లి దేవయ్య, మనుమండ్ల మోహన్ తదితరులు పాల్గొన్నారు.

పబ్లిక్ పరీక్షలు వాయిదా వేయండి: నారా లోకేశ్

అమరావతి, ఏప్రిల్ 25: పబ్లిక్ పరీక్షలపై సర్కారు మొండి వైఖరి వీడకపోతే కోర్టుకు వెళతామన్నారు టీడీపీ నేత నారా లోకేశ్. కరోనా వ్యాప్తి నేపథ్యంలో విద్యార్థుల ప్రాణాలు పణంగా పెడతారా అంటూ టీడీపీ ఎమ్మెల్సీ నారా లోకేశ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పది, ఇంటర్, డిగ్రీ, ఇంజినీరింగ్ పరీక్షలు ఒకవేళ పరీక్షలు చేపట్టాలని ప్రభుత్వం ముందుకు వెళితే తాము న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని లోకేశ్ హెచ్చరించారు. కరోనా సోకితే కనీసం ఆసుపత్రుల్లో బెడ్ కూడా దొరకని పరిస్థితి ఉందని, ఔషధాలకూ విపరీతమైన డిమాండ్ ఏర్పడిందని అన్నారు. మరోవైపు ప్రస్తుత పరిస్థితుల్లో పరీక్షల నిర్వహణ ఎంతో ప్రమాదకరమని నిపుణులు చెబుతున్నా ప్రభుత్వానికి తలకెక్కడంలేదని విమర్శించారు. విద్యార్థుల తల్లిదండ్రులు సైతం పరీక్షలు వద్దనే కోరుకుంటున్నారని, తాము వాట్సాప్ ద్వారా అభిప్రాయ సేకరణ జరిపితే 80 శాతం మంది పరీక్షలు ఇప్పుడు వద్దంటున్నారని వివరించారు.

ఏపీ సర్కారు పబ్లిక్ పరీక్షలను వాయిదా వేయాల్సిందేనంటూ లోకేశ్ గత కొన్నిరోజులుగా డిమాండ్ చేస్తున్నారు. తాజాగా ఇదే అంశంపై లోకేశ్ మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. పరీక్షలు నిర్వహించాలన్న మొండివైఖరిని సర్కారు విడనాడాలని డిమాండ్ చేశారు. ఒకవేళ పరీక్షలు చేపట్టాలని ప్రభుత్వం ముందుకు వెళితే తాము న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తామని లోకేశ్ హెచ్చరించారు.

వైసీపీ ఎమ్మెల్యేలను వెంటాడుతున్న కరోనా

అమరావతి, ఏప్రిల్ 25:ఏపీలో కరోనా రక్కసి స్వైరవిహారం చేస్తోంది. పాజిటివ్ కేసుల సంఖ్య అంతకంతకు రెట్టింపవుతోంది. పలు జిల్లాల్లో వెయ్యికి పైగా రోజువారీ కేసులు వస్తుండడం పరిస్థితి తీవ్రతకు నిదర్శనం. ప్రజలతోపాటు ప్రజాప్రతినిధులు కూడా కోరాను బారిన పడుతున్నారు. తాజాగా విజయనగరం జిల్లాల్లో ఇద్దరు వైసీపీ ఎమ్మెల్యేలు కరోనా బారినపడ్డారు. విజయనగరం ఎమ్మెల్యే కోలగట్ల వీరభద్రస్వామి, సాలూరు ఎమ్మెల్యే పీడిక రాజన్న దొరకు కరోనా పరీక్షల్లో పాజిటివ్ అని నిర్ధారణ అయింది. దాంతో వారిరువురు ఐసోలేషన్ లోకి వెళ్లారు. వైద్యుల పర్యవేక్షణలో చికిత్స పొందుతున్నారు. గత కొన్నిరోజుల వ్యవధిలో తమను కలిసిన వారు కరోనా పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని పిలుపునిచ్చారు. కాగా, ఇప్పటికే వైసీపీకి చెందిన పలువురు ఎమ్మెల్యే కరోనా బారిన పడిన సంగతి తెలిసిందే.

ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు ఉచిత వ్యాక్సినేషన్- ఐటీ సంస్థల నిర్ణయం

హైదరాబాద్ ఏప్రిల్ 24:కరోనా సెకండ్వేవ్తో దేశం, రాష్ట్రంలో కొవిడ్ పాజిటివ్ కేసులు పెరిగి ఎక్కువ మంది మృ త్యువాత పడుతుండడంతో సాఫ్ట్వేర్ కంపెనీలు ఇతర కంపె నీలకు ఆదర్శవంతమైన నిర్ణయం తీసుకున్నాయి. ఐటీ కంపె నీల్లో పనిచేస్తున్న లక్షలాది మంది ఉద్యోగులకు ఉచితంగా టీకా వేయించేందుకు నడుం బిగించాయి. కేవలం ఉద్యోగులకే కాకుండా వారి కుటుంబ సభ్యులకు కూడా ఎలాంటి ఖర్చు లేకుండా టీకా వేయించాలని నిర్ణయించాయి. దీంతో రాష్ట్ర రాజధాని హైదరాబాద్లో ఐటీ రంగంలో పనిచేస్తున్న 5 లక్షల మంది ఉద్యోగులకు కొవిడ్ విషయంలో కాస్త ఉపశమనం లభించినట్లయింది. కరోనా రెండోవేవ్లో మొదటి వేవ్ కంటే ఎక్కువగా విజృంభిస్తుండడంతో కొవిడ్ వ్యాక్సిన్ను రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రైవేటు ఆస్పత్రులు, సంస్థలు నేరుగా మార్కెట్ నుంచి కొనుగోలు చేసుకోవడానికి అను మతిచ్చిన విషయం తెలిసిందే.

దీంతో వ్యాక్సిన్ తయారు చేస్తున్న ఫార్మా కంపె నీలతో పాటు ఇతర దేశాల నుంచి వ్యాక్సిన్ను దిగుమతి చేసు కుని ఇండియాలో మార్కెటింగ్ చేసే కంపెనీలతో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్సీఎల్ టెక్నాలజీస్, టెక్ మహీంద్రా వంటి పేరు మోసిన ఐటీ కంపెనీలు ఉద్యోగుల కోసం గుంపగుత్తగా టీకా కొనుగోలుకు ఒప్పందం చేసుకునే ప్రయత్నాలను ఇప్పటికే ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ ఐటీ కంపెనీలు కేవలం టీకా తయారుచేసే, సరఫరా చేసే ఫార్మా కంపెనీలతోనే కాకుండా త మ ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు నిర్ణీత వ్యవధిలో దానిని ఇచ్చేందుకుగాను కార్పొ రేట్ ఆస్పత్రులతోనూ ఒప్పందాలు కుదర్చుకునే ప్రయత్నాల్లో ఉన్నట్లు సమాచారం. పెద్ద ఐటీ కంపెనీలన్నింటికి రాష్ట్ర రాజధాని హైదరాబాద్లో క్యాం పస్లున్నాయి. ఈ కంపె నీల్లోనే ఎక్కువ సంఖ్యలో ఉద్యో గస్తులు పనిచేస్తుంటారు. దీంతో హైదరాబాద్లో ఐటీ ఉద్యో గులకు జూన్ నెల తర్వాత కొవిడ్ విషయంలో ఎలాంటి ఆందో ళన అవసరం లేదని పలువురు పేర్కొంటున్నారు.

ఐటీ కంపెనీల్లో 80 శాతం దాకా 45 ఏళ్లలోపు వారే?

సాధారణంగా ఐటీ కంపెనీల్లో 80 శాతం దాకా 45 ఏళ్లలోపు యువతే ఎక్కువగా సాఫ్ట్వేర్ ఇంజనీర్లుగా వివిధ హోదాల్లో పనిచేస్తుంటారు. వీరికి కేంద్ర ప్రభుత్వం నిర్వ హించిన రెండు విడతల వ్యాక్సినేషన్ ప్రక్రియలో టీకా లభిం చలేదు. అయితే తాజాగా వ్యాక్సినేషన్ విషయంలోఆంక్షలు లేవని, మే 1వ తేదీ నుంచి 18 ఏళ్ల పైబడిన వారందరికీ వ్యాక్సిన్ ఇవ్వచ్చని ప్రకటించడంతో తమ ఉద్యోగులకు టీకా త్వరగా ఇప్పించే విషయంలో ఐటీ కంపెనీలు యుద్ధ ప్రాతిపదికన ప్రణాళికలు సిద్ధం చేయడంతో పాటు అందుకు సంబంధించి ఏర్పాట్లను చకచకా పూర్తి చేస్తున్నాయని పలు వురు కంపెనీల యాజమాన్య ప్రతినిధులు చెబుతున్నారు.

టీకా తర్వాత వర్క్ఫ్రమ్హోమ్ నుంచి దశల వారిగా ఉద్యోగులు కార్యాలయాలకు?

తమ ఉద్యోగులకు కొవిడ్కు టీకా ఇచ్చే ప్రక్రియ పూర్త యిన తర్వాత వారికి కరోనా సోకే అవకాశాలు తగ్గిపోతాయని, దీంతో వారిని వర్క్ఫ్రమ్హోమ్ నుంచి దశలవారిగా కార్యాల యాలకు రప్పించి విధులు నిర్వహించేందుకు ఆదేశాలి వ్వవచ్చని ఐటీ కంపెనీల యాజమాన్యాలు భావిస్తున్నాయి. ప్రస్తుతం కార్యాలయాల్లో విధులు నిర్వహించే అవసరమున్న ఉద్యోగులతో వర్క్ఫ్రమ్ హోమ్ చేయిస్తుండడంతో ఆప రేషన్స్లో పలు సమస్యలు వస్తున్నాయని వారు భావిసు ?తన్నారు. తమ కంపెనీలకు మూల ధనం ఉద్యోగులనేని వారి మేధాశక్తితోనే తాము వ్యాపారం చేస్తున్నందున వారి ఆరోగ్యం తమకు అన్నింటికంటే ముఖ్యమని కంపెనీలు పేర్కొం టున్నాయి. హైదరాబాద్లోని ఐటీ కంపెనీ క్యాంపస్లలోనూ దాదాపు 70 శాతం మంది ఉద్యోగులు వర్క్ఫ్రమ్హోంలోనే ఉన్నారు. వీరంతా మొదటి దశ కరోనా ఉత్పాతం నుంచి బయటపడి ఇప్పుడిప్పుడే కార్యాలయాలకు విధులు నిర్వహిద్దామనుకునే లోపు సెకండ్ వేవ్ రూపంలో వైరస్ విరుచుకుపడడంతో కంపెనీలు ఇచ్చే టీకా తీసుకుంటే తప్ప బయట అడుగు పెట్టే పరిస్థితి ఉండదన్న నిర్ణయానికొచ్చారు.

ఐటీ కంపెనీల వద్ద భారీగా నగదు నిల్వలు?.

తమ ఉద్యోగులు లక్షల సంఖ్యలో ఉన్నప్పటికీ వారికి కొవిడ్ టీకా ఇప్పించడానికి అయ్యే ఖర్చు భరించడం ఐటీ కం పెనీలకు పెద్ద పనికాదని తెలుస్తోంది. సాధారణంగా పేరు మోసిన ఐటీ కంపెనీలకు ఉద్యోగుల జీతాలు, వీసాలు తప్ప పెద్దగా ఖర్చు లేకపోవడంతో వారికి లాభాల మార్జిన్ ఎక్కు వగా ఉంటుంది. దీనికి తోడు ఆయా కంపెనీలకు సామర్థ్య విస్తరణకు కూడా పెద్దగా పెట్టుబడి అవసరం లేకపోవడంతో వాటి బ్యాలెన్స్ షీట్లలో భారీగా నగదు నిల్వలున్నట్లు కంపెనీలే వాటి త్రైమాసిక ఆర్థిక ఫలితాల సందర్భంగా వెల్లడిస్తుంటాయి. దీంతో ఈ కంపెనీలకు ఉద్యోగులకు టీకా ఇప్పి ంచడం పెద్ద పనికాదని పలువురు సీనియర్ ఐటీ ఉద్యోగులు వ్యాఖ్యానిస్తున్నారు.

ఐటీ ఉద్యోగుల పర్చేజింగ్ పవర్తో ఆర్థిక వ్యవస్థకు ఊతం

హైదరాబాద్ లాంటి నగరంలో సర్వీసు రంగమే ఆర్థిక వ్యవస్థకు ఊతంగా ఉంటుంది. సర్వీసు రంగానికి ప్రజల కొను గోలు శక్తే ఆధారం. ఐటీ ఉద్యోగులకు సాధారణంగానే జీతాలు భారీగా ఉంటాయి. దీంతో వీరు చేసే ఖర్చు మనీ రొటేషన్కు అవకాశం కల్పిస్తుంటుంది. అయితే గతేడాది కొవిడ్ మహ మ్మారి రంగ ప్రవేశం తర్వాత ఐటీ ఉద్యోగులు సాధారణంగా బయటికి వచ్చి చేసే ఖర్చు తగ్గిందని పలు నివేదికలు చెబు తున్నాయి. ఉదాహరణకు వీరు వర్క్ ఫ్రమ్ హోమ్ చేయడం కారణంగా ఎంతో మంది మ్యాక్సీ క్యాబులు నడిపే కాంట్రాక్టు వాహనాల యజమానులు ఉపాధి కోల్పోయి కనీసం వాహనాలకు ఈఎంఐలు కట్టలేని పరిస్థితి నెలకొంది. అంతేగాక సాఫ్ట్వేర్ ఉద్యోగులు ఇళ్ల నుంచే విధి నిర్వహణ చేస్తుండడంతో కార్యాలయాల్లో క్యాంటిన్లు, కార్యాలయాల బయట వీధి వ్యాపారాలు చేసుకునే వారు ఎంతోమందికి గిరాకీ లేక ఉపాధి కోల్పోయే పరిస్థితి తలెత్తింది. దీంతో పాటు వారంతంలో మిగతా వారితో పోలిస్తే హైదరాబాద్ లాంటి మెట్రో నగరాల్లో ఐటీ ఉద్యోగులు మాల్స్, రెస్టారెంట్లు, షాపింగ్లలో చేసే ఖర్చు ఎక్కువగా ఉంటుంది. అయితే కొవిడ్ తర్వాత పరిస్థితిలో మా ర్పు వచ్చి వీరు పొదుపు వైపు పయనిస్తున్నట్లు పలువురు ఆర్థిక వేత్తలు విశ్లేషిస్తున్నారు. అయితే టీకా తర్వాత పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చి కార్యాలయాలు ఐటీ ఉద్యోగులతో కలకలలాడి ఆర్థిక వ్యవస్థలో మనీ రొటేషన్ ఉంటుందని వారు పేర్కొంటున్నారు.

గ్రామ పంచాయితీ కార్మికులకు పిఆర్సీ ..

మహబూబ్నగర్, ఏప్రిల్ 24: రాష్ట్ర ప్రభుత్వం గ్రామ పంచాయితీ కార్మికులకు పిఆర్సీని అమలు చేయాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆంజనేయులు తెలిపారు. గ్రామ పంచాయితీ కార్మికులు స్థితిగతులపై గ్రామాల పర్యటన కార్యక్రమంలో భాగంగా మండలంలోని రఘుపతి పేట గ్రామంలో పారిశుద్ధ్య కార్మికులతో ఆంజనేయులు మాట్లాడి సమస్యలు అడిగితెలుసుకున్నారు. గ్రామాల అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న కార్మికులకు పిఆర్సి అమలు చేసి వారిని అదుకొవాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా వారికి మాస్క్లు, గ్లౌజులు ఇవ్వడంలేదని అన్నారు. కార్మికులకు నెలకు 4రోజులు సెలవులు ఇవ్వాలని ఆంజనేయులు ప్రభుత్వన్ని కొరారు. కార్మికులకు ఇచ్చె వేతనం గత 4నెలలనుండి బకాయిలు ఉన్నాయని తెలిపారు. కార్మికులకు వెంటనే ప్రభుత్వం బకాయిలను చెల్లించాలన్నారు. లేని యెడల కార్మికులతో కలిసి అందోళన చేస్తామని ఆంజనేయులు హెచ్చరించారు. కార్యక్రమంలో కార్మికులు తదితరులు ఉన్నారు.

వెంకటేశ్వర స్వామికి ప్రత్యేక పూజలు..

మహబూబ్నగర్, ఏప్రిల్ 24: జిల్లా కేంద్రంలోని 3వ వార్డ్ పీజేపీ క్యాంప్ లో శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో మున్సిపల్ చైర్మన్ బి.యస్.కేశవ్ ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్.. మంత్రి కేటీఆర్,మంత్రి నిరంజన్ రెడ్డి కోలుకోవాలన్నారు. శ్రీలక్ష్మి వెంకటేశ్వర స్వామి వారి దేవస్థానంలో 51 కొబ్బరికాయలు కొట్టి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్స్ గీతమ్మనాగులుయాదవ్, మురళి శ్రీమన్నారాయణ టీ.శ్రీను నరహరి గౌడ్ జములమ్మ ఆలయ కమిటీ చైర్మన్ సతీష్ డైరెక్టర్స్ ..జానకిరాములు.. కమ్మరిరాము.. తెరాస నాయకులు కోటేష్ రంజిత్.. షుకూర్ కృష్ణ.. బి.చిన్న.. ఐడియా పరుశరామ్.. వెంకటేష్ ..మెకానిక్ మధు రీజ్వన్.. గట్టురాము తదితరులు పాల్గొన్నారు

వైభవంగా వీరప్పయ్యస్వామిరథోత్సవం..

మహబూబ్నగర్, ఏప్రిల్ 24: మండల కేంద్రంలో స్థానిక ఈశ్వర్ వీరప్పయ్యస్వామి రథోత్సవ కార్యక్రమం వైభవంగా జరిగింది.రథోత్సవాన్ని రంగు రంగులతో తీర్చిదిద్ది విద్యుత్తు దీపాలతో అలంకరణ చేశారు.కోవిడ్ నిబంధనల ప్రకారమే రథోత్సవ కార్యక్రమాలను ఆలయ ప్రాంగణంలోనే నిర్వహించారు. స్వామివారికి దేవాలయ చైర్పర్సన్ రాధిక భాస్కర్ రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు.స్వామివారి విగ్రహాన్ని రథోత్సవంపై కూర్చోబెట్టి అర్చకులు నాగరాజు.. నాగభూషణం.. అలంకరణ చేశారు.గోవిందా గోవిందా అంటూ పిల్లలు.. మహిళలు.. పెద్దలు రథోత్సవాన్ని లాగారు.తదుపరి స్వామివారు పల్లకి సేవ కార్యక్రమాలను నిర్వహించారు.రథోత్సవానికి భక్తులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు.అనంతరం భజన కార్యక్రమాలు నిర్వహించారు.ఈ క్రమంలో ఆలయ కమిటీ సభ్యులు భిక్షపతి.. బాల్ రాజు.. చెన్నయ్య.. భీమన్న. .నర్సింలు.. ఆంజనేయులు.. వెంకటయ్య.. సూరిబాబు..తదితరులు పాల్గొన్నారు.

భారత్ భయంకరమైన స్థితిలో ఉన్నది: ఆంథోనీ ఫౌసీ

వాషింగ్టన్, ఏప్రిల్ 24: : దేశంలో కరోనా మహమ్మారి కరాళ నృత్యం చేస్తున్నది. రోజూ లక్షల్లో కొత్త కేసులు నమోదవుతున్నాయి. గత నాలుగు రోజులుగా మూడు లక్షలకు తగ్గకుండా రోజువారీ కొత్త కేసులు నమోదయ్యాయి.

ఈ నేపథ్యంలో భారత్లో పరిస్థితిపై అమెరికా అధ్యక్షుడి అత్యున్నత స్థాయి వైద్య సలహాదారు ఆంథోనీ ఫౌసీ స్పందించారు.ప్రస్తుతం భారత దేశం అత్యంత భయంకరమైన పరిస్థితిని ఎదుర్కొం టున్నదని డాక్టర్ ఆంథోనీ ఫౌసీ వ్యాఖ్యానించారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ప్రస్తుతం భారత్ చాలా ఘోరమైన స్థితిని ఎదుర్కొంటున్నదని చెప్పారు. ప్రపంచంలో మరే దేశంలోనూ లేనంత అధిక సంఖ్యలో కోవిడ్ కేసులు భారత్లో నమోదవుతున్నాయన్నారు. భారత్లోని కరోనా వైరస్ రూపాల లక్షణాలు ఇంకా స్పష్టంగా తెలియడం లేదన్నారు.

అంతేగాక, కరోనా వైరస్ రూపాల నుంచి కాపాడగలిగే సామర్థ్యం వ్యాక్సిన్లకు ఉందా? అనే విషయం కూడా ఇంకా పూర్తిగా తెలియదన్నారు ఫౌసీ

. భారత దేశానికి వ్యాక్సిన్లు అవసరమనే విషయం స్పష్టమవ ుతోందని చెప్పారు. అమెరికన్ సెంటర్స్ ఫర్ డిసీజ్ కంట్రోల్ అండ్ ప్రివెన్షన్ భారత దేశంలోని ఆరోగ్య వ్యవస్థతో కలిసి పని చేస్తున్నదని ఆయన తెలిపారు.కాగా, శనివారం ఉదయం కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ వెల్లడించిన వివరాల ప్రకారం.. దేశవ్యాప్తంగా గడచిన 24 గంటల్లో 3,46,786 కొత్త కొవిడ్-19 పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. కరోనా మహమ్మారి దేశంలో కాలుమోపినప్పటి నుంచి ఒకేరోజు ఇంత పెద్ద మొత్తంలో కేసులు నమోదు కావడం ఇదే తొలిసారి. ఈరోజే కాదు. గత రెండు మూడు వారాలుగా కొత్త కేసుల విషయంలో ప్రతిరోజూ రికార్డు బద్దలవుతూనే ఉన్నది.

టిటికె ప్రెస్టీజ్ యొక్క గ్రైండర్ పిడబ్ల్యుజి మార్కెట్లోకి

హైదరాబాద్ ఏప్రిల్ 24: ప్రముఖ మై టిటికె ప్రెస్టేజ్ తన నూతన ఉత్పత్తిని వినియోగ దారుల కోసం మార్కెట్లోకి ప్రవేశపెట్టింది. దోసలు, మృదువైన ఇడ్లిస్ లేదా మెత్తటి వడాస్ వంటి రుచికరమైన పదార్థాల కోసం తడి గ్రైండర్ బ్యాటర్స్ కలగలుపును సిద్ధం చేస్తుంది. గ్రౌండింగ్ యొక్క ఇబ్బందిని తొలగించడానికి అప్రయత్నంగా అనుభవాన్ని ఆస్వాదించడానికి, టిటికె ప్రెస్టీజ్ యొక్క కొత్త తడి గ్రైండర్ పిడబ్ల్యుజి 11 వినియోగదారులకు ఉపయోగంగా ఉంటుందని సంస్థ విడుదల చేసిన ప్రకటనలో వివరించింది. వేగవంతమైన, సమర్థవంతమైన కొబ్బరి స్క్రాపింగ్ కోసం కొబ్బరి స్క్రాపర్, పిండిని పిసికి కలుపుటకు అటా కండర అటాచ్మెంట్ వంటి అనుకూలమైన జోడింపులతో కూడి ఉంటుంది. పరాఠాలు, చపాతీలు, పేదలు మొదలైనవారికి. కాంపాక్ట్ డిజైన్, తక్కువ స్థలాన్ని ఆక్రమించింది మరియు పోర్టబుల్. ఇది తడి గ్రైండర్ను ఎక్కడైనా ఉపయోగించడానికి సులభం చేస్తుంది. తడి గ్రైండర్లో అధిక నాణ్యత గల గ్రానైట్ గ్రౌండింగ్ రాళ్ళు ఉన్నాయి, ఇది పిండి యొక్క ప్రామాణికమైన రుచులను సంరక్షిస్తుంది మరియు నిలుపుకుంటుంది. 2 లీటర్ స్టెయిన్లెస్ స్టీల్ డ్రమ్, మిర్రర్ ఫినిషింగ్ చాలా మన్నికైనది మరియు శుభ్రపరచడం సులభం. హెవీ డ్యూటీ 200చి మోటారు అన్ని గ్రౌండింగ్ అవసరాలకు ఇది పరిపూర్ణంగా ఉంటుంది. పిడబ్ల్యుజి 11 ఐఎన్ఆర్ 6195 కు రిటైల్ అవుతుందిఇది ప్రెస్టీజ్ ఎక్స్క్లూజివ్ స్టోర్స్లో మరియు కర